http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 23 సెప్టెంబర్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ అభివృద్ధిపై

# స్పెషల్ ఫోకస్

- తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్
- ఐదు ప్రధాన అంశాల ప్రాతిపదికన అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం
- వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు
- మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై పలు ముఖ్యమంత్రి సూచనలు
- వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలి



హైదరాబాద్

తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు అధికారులు. ఐదు ప్రధాన అంశాల ప్రాతిపదికన అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సీఎంకు వివరించారు అధికారులు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను - మిగతా 3లో



## కాంగ్రెస్‌కు ఓటేస్తే మన ఇండ్లను కూల్చేందుకు

# లైసెన్స్ ఇచ్చినట్లే

- దొంగను దొంగ లెక్క చూడక మరెలా చూస్తారు..?
- పేద ఇండ్లను రేవంత్‌రెడ్డి ఆదివారమే ఎందుకు కూల్చివేస్తున్నారు
- గతంలో హైకోర్టు సెలవు దినాల్లో కూల్చివేతలు వద్దని స్పష్టంగా చెప్పింది
- మోదీ జీఎస్టీ తగ్గించి పండగ చేస్కో అంటున్నడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు

హైదరాబాద్

కాంగ్రెస్‌కు ఓటేస్తే మన ఇండ్లను కూల్చేందుకు లైసెన్స్ ఇచ్చినట్లే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ బోరబండ డివిజన్ బూత్‌స్థాయి - మిగతా 3లో



## నా రీల్స్ చూడటం తగ్గించండి సారూ..

ఢిల్లీ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు

కేజ్రీవాల్ పంజాబ్ ప్రజలపై దృష్టి పెట్టాలి

## ట్రంప్ హెచ్1బీ వీసా నిర్ణయంతో అమెరికా కంపెనీలపై రూ.1.23 లక్షల కోట్ల భారం



ఏటా 14 బిలియన్ డాలర్లు వెచ్చించాల్సి రావొచ్చు

ఫిబ్రవరిలో లాటరీలో రానున్న కొత్త దరఖాస్తులకు మాత్రమే ఇది వర్తించనుంది

## స్వదేశీ ఉత్పత్తులే కొనాలి.. విక్రయించాలి

- జీఎస్టీ సంస్కరణలపై దేశ ప్రజలను ప్రధాని మోదీ లేఖ
- దేశవ్యాప్తంగా 'జీఎస్టీ పొదుపు ఉత్సవం' మొదలైంది
- "తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు ప్రజల్లో పొదుపును పెంచుతాయి
- రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులు, ఎంఎస్ఎంఈ తదితర అన్ని వర్గాలకు నేరుగా లబ్ధి చేకూరుతుంది.



## రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం

# వేగవంతం చేయాలి



- రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలతో పాటు రేడియల్ రోడ్ల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు
- పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలి
- వీలైనంత త్వరగా రూట్ మ్యాప్‌పై తుది నిర్ణయం తీసుకోవాలి
- హైదరాబాద్– శ్రీశైలం హైవేలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నుంచి వీలైనంత త్వరగా అనుమతులు తీసుకోవాలి

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం మాట్లాడారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలతో పాటు రేడియల్ రోడ్ల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందుకు అవసరమైన పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. - మిగతా 3లో



## టారిఫ్‌లపై ఎందుకు స్పందించట్లేదంటే

- రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- "అవును ప్రభుత్వం ఇంతవరకు రియాక్ట్ కాలేదు
- విశాల దృక్పథం, గొప్ప మనసు ఉన్నవారు ఏ విషయంపైనైనా వెంటనే స్పందించరు"
- పాక్ ఆక్రమిత కశ్మీర్ శాంతియుతంగానే భారత్‌లో భాగమవుతుంది
- రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "దానంతట అదే పీఓకే మన పరిధిలోకి వస్తుంది.

## మూడు విడతల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు

- మూడు విడతల్లో నిర్వహించే ఆలోచనలో ఎన్నికల కమిషన్ ఉన్నట్టు సమాచారం
- ఈనెల 28న ఛట్‌పూజ ముగిసిన అనంతరం ఎన్నికలు నిర్వహించనుంది
- సెప్టెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను ఈసీ ప్రచురించనుంది
- రివిజన్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను ఈసీ తొలగించింది.



## నళినికి మద్దతుగా నిలిచిన

# బిజెపి బృందం

ఇప్పటికైనా ఆమె రిటైర్మెంట్ ప్రయోజనాలను విడుదల చేయాలి

ఆమెను మానసిక వేదన నుండి బయటకు తీసుకోవాలని డిమాండ్

భువనగిరి నళిని స్వగృహానికి వెళ్లి పరామర్శించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు బృందం



హైదరాబాద్

బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాజీ డీఎస్పీ నళినిని ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నళిని గారి ఆరోగ్య పరిస్థితి, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి , మాజీ ఎంపీ, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ , సీనియర్ నాయకులు గూడూరు నారాయణ రెడ్డి , జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ , ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భం గా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మీడియాతో మాట్లాడుతూనళిని తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీస్ ఫోర్స్‌లో ఉన్నప్పటికీ జై తెలంగాణ - మిగతా 3లో



## ట్రంప్ ఎన్నడూ ప్రధాని మోదీని వ్యతిరేకించలేదు

- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచ అగ్రనేతలతో వ్యక్తిగత స్నేహం ఉంది
- అందుకే ప్రధానిమోదీకి అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా ఉంది
- భారత్–అమెరికా సంబంధాలలో ఎటువంటి విఘాతం ఏర్పడబోదు
- మోదీ తనకు గొప్ప స్నేహితుడని చెబుతూనే ఉన్నారు

# మూడు విడతల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించే ఆలోచనలో ఎన్నికల కమిషన్ ఉన్నట్టు సమాచారం. ఈనెల 28న ఛట్‌పూజ ముగిసిన అనంతరం ఎన్నికలు నిర్వహించనుందని, నవంబర్ 5 నుంచి 15వ తేదీ వరకూ మూడు విడతల్లో ఎన్నికలు జరుగవచ్చని కథనాలు వెలువడుతున్నాయి. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 22వ తేదీతో ముగియనుంది. దీంతో ఈ గడువుకు ముందే ఎన్నికల ప్రక్రియ ఈసీ పూర్తి చేయాల్సి ఉంది. ఎన్నికల సన్నాహకాలు, తుది ఓటర్ల జాబితాపై సమీక్ష కోసం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వచ్చే వారంలో బిహార్‌లో పర్యటించనున్నారు. సెప్టెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను ఈసీ ప్రచురించనుంది. కాగా, ఎన్నికల కమిషన్ ఇటీవలే పూర్తి చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై బిహార్‌లో రాజకీయ వేడి రగిలింది. రివిజన్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను ఈసీ



తొలగించింది. నిజమైన ఓటర్లను తొలగించేందుకే ఈసీ ఈ చర్య చేపట్టిందని విపక్ష 'ఇండియా' కూటమి తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30న ప్రచురితమయ్యే తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు జరిగినట్టు గుర్తించినా మొత్తం ప్రక్రియనే రద్దు చేస్తామని సుప్రీంకోర్టు గత వారంలో హెచ్చరించింది.

**2020లోనూ మూడు దశల్లో పోలింగ్**

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతల్లో జరగడం కొత్త కాదు. 2020లోనూ మూడు విడతలుగా పోలింగ్ నిర్వహించారు. అక్టోబర్ 28న 71 సీట్లకు పోలింగ్ జరుగగా, నవంబర్ 3న 94 నియోజకవర్గాల్లోనూ, నవంబర్ 7న 78 నియోజకవర్గాల్లోనూ పోలింగ్ జరిగింది. నవంబర్ 10న ఫలితాలు ప్రకటించారు. 2015లో ఐదు విడతలుగా ఎన్నికలు జరిగాయి.

**రెండు కూటముల మధ్యే పోటీ**

ఈఏడాది కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ ఎన్డీయే, 'ఇండియా' కూటముల మధ్యే ఉంది. ఎన్డీయేలో బీజేపీ, జనతాదళ్ (యునైటెడ్), లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) భాగస్వాములుగా ఉన్నాయి. విపక్ష కూటమిలో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ), కాంగ్రెస్, వామపక్షాలు ఉన్నాయి.

# ట్రంప్ హెచ్1బీ వీసా నిర్ణయంతో అమెరికా కంపెనీలపై రూ.1.23 లక్షల కోట్ల భారం

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా టెక్ కంపెనీల యాజమాన్యాలు ఇకనుంచి హెచ్1బీ వీసాలపై ఏటా 14 బిలియన్ డాలర్లు వెచ్చించాల్సి రావొచ్చు. వీటి ఫీజును భారీగా పెంచి లక్ష డాలర్లు చేయడం సంస్థలకు మోయలేని భారంగా మారే ప్రమాదం ఉంది. ఈమేరకు ఫైనాన్షియల్‌టైమ్స్ ఓ కథనం వెలువరించింది. ఫిబ్రవరిలో లాటరీలో రానున్న కొత్త దరఖాస్తులకు మాత్రమే ఇది వర్తించనుంది. అమెరికన్లను నియమించుకొనేలా కంపెనీలపై ఒత్తిడి చేయడమే లక్ష్యంగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకొన్నారు. గతేడాది అన్నీకలిపి 1,41,000 హెచ్1బీ వీసాలు జారీ చేసినట్లు అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ లెక్కలు చెబుతున్నాయి. అదేస్థాయిలో వీసాలు జారీ చేస్తే.. వాటి కోసం చెల్లించాల్సిన ఫీజు మొత్తం 14 బిలియన్ డాలర్ల (రూ.1.23 లక్షల కోట్లు) గా అంచనాలు ఉన్నాయి. ఈ నిర్ణయం స్టార్టప్ సంస్థలకు శరాఘాతమేనని స్టార్టప్ ఇంక్యుబేటర్ వై కాంబినేటర్ సీఈవో గారీటాన్ వెల్లడించారు. విదేశాల్లోని టెక్ హబ్‌లకు ఇది ఓ బహుమతిగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ నిర్ణయాన్ని కోర్టుల్లో సవాలు చేసే అవకాశం ఉందని ఓ న్యాయవాది వెల్లడించారు. ఈ వీసాలపై అధికారాల పరిధిని దాటి నిర్ణయం తీసుకొన్నారని చెబుతున్నారు. ట్రంప్ ప్రకటనను న్యాయస్థానాలు అడ్డుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. వీసాకు అవసరమైన కనీస






వేతనం పెంపు వంటి విస్తృత మార్పులపై ట్రంప్ కార్యవర్గం గురిపెట్టి ఈ ప్రకటన చేసిందన్నారు. ఇప్పటికే కొందరు రిపబ్లికన్ చట్టసభ సభ్యులు లాటరీ విధానంలో కాకుండా.. జీతాల ఆధారంగా ఈ వీసాలు మంజూరుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఢాకాలో డెంగ్యూ దడ.. ఒక్క రోజులో రికార్డు స్థాయి మరణాలు

**ఢాకా:** బంగ్లాదేశ్‌ను డెంగ్యూ వ్యాధి పట్టిపీడిస్తోంది. దేశవ్యాప్తంగా అంతకంతకూ పెరుగుతున్న కేసులు, మరణాలు సంఖ్య ప్రభుత్వానికి దడ పుట్టిస్తోంది. దేశంలో డెంగ్యూ కారణంగా ఒక్క రోజులో రికార్డు స్థాయి మరణాల సంఖ్య నమోదైంది. దీర్ఘకాలిక రుతుపవన పరిస్థితులు, దోమల విజృంభణ కారణంగా డెంగ్యూ వ్యాప్తి మరింత తీవ్రమవుతున్నదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స తీసుకోవడం, నిలిచిపోయిన మురుగు నీటిని తొలగించడం ద్వారా డెంగ్యూను తరిమికొట్టవచ్చని వారు సూచిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో డెంగ్యూ కారణంగా గడచిన 24 గంటల్లో 12 మంది మృతిచెందారు. రాజధాని ఢాకాలో కొత్తగా 700 కేసులు నమోదయ్యాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు, దేశవ్యాప్తంగా 179 డెంగ్యూ బారిన పడి మృతిచెందగా, 42 వేల మంది డెంగ్యూ బారిన పడ్డారని పేర్కొంది. అధిక సంఖ్యలో పిల్లలు డెంగ్యూ బారినపడి ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. బాధితులలో చాలామంది అధిక జ్వరం, దద్దుర్లు, తీవ్రమైన నిర్జలీకరణతో బాధపడుతున్నారు. ఇటువంటి సందర్భాల్లో నిర్లక్ష్యం తగదని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎబిఎం అబ్దుల్లా తెలిపారు. 2023లో దేశంలో డెంగ్యూ కారణంగా రెండువేల మంది మరణించారు. మూడు లక్షల21వేల మందికి పైగా జనం వ్యాధి బారిన పడ్డారు. డెంగ్యూ వైరస్ సాధారణంగా



మధ్య , దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని ప్రాంతాలు, పసిఫిక్ దీవులతో సహా ఉష్ణమండల ప్రాంతాలలో కనిపిస్తుంది. డెంగ్యూ జ్వరం లక్షణాలు దోమ కాటు తర్వాత నాలుగు నుండి 10 రోజుల తర్వాత కనిపిస్తాయి. దోమ కాటు బారినపడకుండా ఉండటమే డెంగ్యూ నివారణకు ఉత్తమమార్గమని వైద్యులు సూచిస్తున్నారు.

# కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ అరెస్ట్

ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ గోసల్ కెనడా దేశంలో అరెస్టయ్యాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గుర్‌పత్వంత్ సింగ్ పన్నూకు ఇంద్రజీత్ సింగ్ సన్నిహితుడు. 2023 నుంచి గోసల్ కెనడాలో ఎస్ఎఫ్‌జే కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. అక్రమంగా ఆయుధాలు కలిగిఉండటం సహా పలు అభియోగాలపై గోసల్‌ను అట్టావాలో అదుపులోకి తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలియజేస్తున్నాయి. గత ఏడాది నవంబర్‌లోనూ కెనడా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గ్రేటర్ టొరంటో ఏరియాలోని ఒక హిందూ ఆలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ప్రమేయం ఉందని ఆ సమయంలో ఆరోపణలు వచ్చాయి. తర్వాత షరతులతో కూడిన బెయిల్ మంజూరు కావడంతో బయటికి వచ్చాడు. ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక కొత్త అధ్యాయానికి తెరతీసేందుకు భారత్ కెనడాల మధ్య అంగీకారం కుదిరిందని ఇటీవల భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ అంగీకారంలో భాగంగా ఉగ్రవాదం, అంతర్జాతీయ నేరాలను ఎదుర్కొనేందుకు కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 2023లో ఒక సిక్కు వేర్పాటువాది హత్య అనంతరం ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండు దేశాలు సంబంధాలను పునరుద్ధరించుకునే ప్రయత్నంలో ఉన్నాయి. అందుకే భారత్, కెనడాలు ఉపసంహరించుకున్న రాయబారులను ఇటీవల తిరిగి నియమించుకున్నాయి. అనంతరం సంబంధాల పునరుద్ధరణే లక్ష్యంగా దేశ రక్షణ సలహాదారు అజిత్ దోవల్, కెనడా భద్రతా సలహాదారు నటాలీ డ్రౌయిన్‌ల మధ్య చర్చలు జరిగాయి. జూన్‌లో కెనడాలో జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ ఇరు దేశాల సంబంధాలపై అక్కడి ప్రధాని మార్క్ కార్నీతో చర్చలు జరిపారు.



## స్వదేశీ ఉత్పత్తులే కొనాలి.. విక్రయించాలి



**ఢిల్లీ:** జీఎస్టీ సంస్కరణలపై దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ విడుదల చేశారు. నేటినుంచి దేశవ్యాప్తంగా 'జీఎస్టీ పొదుపు ఉత్సవం' మొదలైందని పేర్కొన్నారు. "తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు ప్రజల్లో పొదుపును పెంచుతాయి. రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులు, ఎంఎస్ఎంఈ తదితర అన్ని వర్గాలకు నేరుగా లబ్ధి చేకూరుతుంది. ఆర్థిక వృద్ధితోపాటు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయి. ప్రతి రాష్ట్రం పురోగతిని వేగవంతం చేస్తాయి. శ్లాబుల తగ్గింపు వంటి సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ సరళీకృతం, వ్యాపార నిర్వహణ సులభతరం కానున్నాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "కొన్నేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ఆదాయపు పన్నును రూ.12 లక్షల వరకు మినహాయించడం, జీఎస్టీ (%+%) సంస్కరణలతో ఈ ఒక్క ఏడాదే ప్రజలకు రూ.2.50 లక్షల కోట్ల డబ్బు ఆదా కానుంది. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరి. జీఎస్టీ సంస్కరణలు స్థానిక తయారీ రంగాన్ని బలోపేతం చేస్తాయి. స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దుకాణదారులకు నా విజ్ఞప్తి. స్వదేశీ ఉత్పత్తులే కొనాలి.. విక్రయించాలి. పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని రాష్ట్రాలు కల్పించాలి" అని ప్రధాని మోదీ

## ట్రంప్ ఎన్నడూ ప్రధాని మోదీని వ్యతిరేకించలేదు



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ లాంటి ప్రపంచ అగ్రనేతలతో వ్యక్తిగత స్నేహం ఉందని, అందుకే ప్రధానిమోదీకి అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా ఉందని నూతన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికార యంత్రాంగం భారత్‌పై భారీ వాణిజ్య సుంకాలను విధించినప్పటికీ, భారత్–అమెరికా సంబంధాలలో ఎటువంటి విఘాతం ఏర్పడబోదని ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్‌ల స్నేహాన్ని ఉదహరిస్తూ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తన తొలి బహిరంగా సమావేశంలో పేర్కొన్నారు. భారతదేశంపై అమెరికా 50 శాతం సుంకం విధించినప్పటికీ ట్రంప్ .. మోదీ తనకు గొప్ప స్నేహితుడని చెబుతూనే ఉన్నారని, ట్రంప్ ఎన్నడూ తాను మోదీని వ్యతిరేకిస్తున్నానని చెప్పలేదని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మోదీకి ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ మంచి స్నేహితులేనని అందుకే ఆయన(మోదీ) అసాధ్యాలను సుసాధ్యం చేయగలరన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాల ఆధారంగా రూపొందించిన నాలుగు పుస్తకాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. సందర్భంగా ప్రధాని మోదీ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. సమస్యల పట్ల మోదీ వైఖరిని చాలా లోతుగా ఉంటుందని, ప్రజల మనోభావాలను విస్మరించని నేత ప్రధాని మోదీ అని, ఆయన ?ప్రసంగాలు ఎంతో అర్థవంతమైనవని అన్నారు. ప్రపంచ శక్తిగా ఎదగాలనే మన ఆకాంక్ష ఆధిపత్యం ద్వారా సాధ్యంకాదని, ప్రపంచ సంక్షేమం అనే ఆలోచన ద్వారా సమకూరుతుందని భారతదేశం నిరూపించిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ మన అతిపెద్ద సమస్య..ఇతర దేశాలపై ఆధారపడటమేనన్నారు. ప్రధాని మోదీ కూడా ఇదే విషయాన్ని చెప్పారన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే దార్శనికత, లక్ష్యాన్ని ప్రధాని మోదీ కలిగివుండి, ఆ దిశగా దేశాన్ని నడిపిస్తున్నారన్నారు.


## టారిఫ్‌లపై ఎందుకు స్పందించట్లేదంటే:

**ఇంటర్నెట్‌డెస్క్:** రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు మన ఎగుమతులపై అమెరికా 50శాతం సుంకాల భారం వేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఇంతవరకు భారత్ నేరుగా స్పందించలేదు. ఈ విషయమై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. "అవును ప్రభుత్వం ఇంతవరకు రియాక్ట్ కాలేదు. విశాల దృక్పథం, గొప్ప మనసు ఉన్నవారు ఏ విషయంపైనైనా వెంటనే స్పందించరు" అని బదులిచ్చారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**పీఓకేపై కీలక వ్యాఖ్యలు..**

పాక్ ఆక్రమిత కశ్మీర్ శాంతియుతంగానే భారత్‌లో భాగమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "దానంతట అదే పీఓకే మన పరిధిలోకి వస్తుంది. ఆ దిశగా అక్కడ డిమాండ్లు ఇప్పటికే మొదలయ్యాయి. ఐదేళ్లక్రితం జమ్మూకశ్మీర్‌లో భారత సైన్యాన్ని ఉద్దేశించి కూడా నేను ఇదే విషయం చెప్పాను. ఆ ప్రాంతంపై దాడి చేసి, స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదని, అది మనదేనని ఆనాడు అన్నాను. మేం భారత్‌లో భాగమేనని అక్కడే ప్రజలే అంటారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యలు చేశారు.

## నా రీల్స్ చూడటం తగ్గించండి సారూ..



**ఢిల్లీ:** తన రీల్స్ చూడటం ఆపండంటూ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈవీఎంలపై రేఖా గుప్తా మాట్లాడుతున్నట్లుగా ఓ ఎడిటెడ్ వీడియోను సామాజిక మాధ్యమంలో నిన్న(ఆదివారం) కేజ్రీవాల్ షేర్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన రేఖా గుప్తా.. తన వీడియోలు, రీల్స్ చూడటం తగ్గించి.. తన సొంత పార్టీపై దృష్టి పెట్టాలంటూ కేజ్రీవాల్‌కు చురకలు అంటించారు. ఎలక్ట్రిక్ బస్ డిపోకు శంకుస్థాపన చేసిన రేఖాగుప్తా.. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. "నేను కేజ్రీవాల్‌కు ఒకటి చెప్పాలనుకుంటున్నాను.. దయ చేసి నా వీడియోలు, ఇంటర్వ్యూలు, రీల్స్ చూడటం తగ్గించండి" అంటూ హితవు పలికారు. కేజ్రీవాల్ పంజాబ్ ప్రజలపై దృష్టి పెట్టాలి. అత్యంత ఘోరమైన వరద విపత్తును ఎదుర్కొన్న ఆ రాష్ట్రంలో బాధితులను ఆయన ఎప్పుడూ పరామర్శించలేదంటూ ఆమె విమర్శలు గుప్పించారు. "ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మాటలను వక్రీకరించినందుకు మీరు సిగ్గుపడాలి. మీరు 11 సంవత్సరాలు ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నారు. మీరు ఢిల్లీ అభివృద్ధిపై దృష్టి సారించి ఉంటే, ప్రజలు బాధలుపడేవారు కాదంటూ కేజ్రీవాల్‌పై రేఖాగుప్తా ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీపై కూడా ఢిల్లీ సీఎం తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. "కాంగ్రెస్ గెలిస్తే అది ప్రజల తీర్పు, మేము గెలిస్తే ఈవీఎంలు హ్యాక్ అయ్యాయా? ఈ ఫార్ములా ఎక్కడ రాసుంది? అంటూ ఆమె ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయన చెప్పేవన్నీ అబద్ధాలే" అంటూ రేఖా గుప్తా మండిపడ్డారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మన ఇండ్లను కూల్చేందుకు లైసెన్స్ ఇచ్చినట్లే

-మొదటిపేజీ తరువాయి

సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై.. మాట్లాడుతూ పేద ఇండ్లను రేవంత్‌రెడ్డి ఆదివారమే ఎందుకు కూల్చివేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో హైకోర్టు సెలవు దినాల్లో కూల్చివేతలు వద్దని స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. గాజులరామారంలో కోర్టు సెలవు రోజులు చూసుకొని మరీ పేదల ఇండ్లను కూల్చేశారని ఆరోపించారు. ఇవాళ గాజులరామారం.. రేపు జూబ్లీహిల్స్‌లోని బోరబండ బస్తీకి సైతం హైడ్రా పేరుతో వస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మన ఇళ్లు కూల్చేందుకు లైసెన్స్ ఇచ్చినట్లేనన్నారు. బీఆర్ఎస్ కార్యకర్త సర్దార్ ఇంటిని కూల్చివేశారని.. కాంగ్రెస్ కూల్చిన ఇళ్లను మళ్లీ కట్టించి ఇచ్చే బాధ్యత నాదేనన్నారు. హైడ్రా బుల్డోజర్ పేదల ఇండ్లపైకే వెళ్తుందని.. పెద్దల ఇండ్లకు వెళ్లదని విమర్శించారు. సీఎం సోదరుడు, మంత్రులు పొంగులేటి, వివేక్ వంటి వారు.. ప్రభుత్వ స్థలాల్లో, చెరువులపైన ఇండ్లు కట్టుకున్నా హైడ్రా కూల్చివేయలేదన్నారు.

**దొంగను దొంగ లెక్క చూడక మరెలా చూస్తారు..?**

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులోనే వివేక్, పొంగులేటి, కేవీపీ ఇండ్లు ఉన్నాయని తెలిపారు. శని, ఆదివారాలుల వచ్చాయంటేనే పేద ఇండ్లను హైడ్రా కూల్చివేస్తోందని మండిపడ్డారు. హైదరాబాద్‌ను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని.. 42 ఫ్లైఓవర్లు కట్టామన్నారు. రాహుల్ గాంధీకి హైడ్రా కూల్చివేతలు, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏవీ కనపడవని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి జెండా కాంగ్రెస్ అయినా.. ఎజెండా



బీజేపీదేనని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ ఒక్కటేనని.. మతాల మధ్య చిచ్చుపెడుతున్నాయని ఆరోపించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క పంచాయితీ కూడా లేదని.. పదేళ్లు జోర్దార్‌గా నడిచిన పాలన ఇప్పుడు ఆగమైందన్నారు. కేసీఆర్ రూ.లక్ష ఇస్తే.. తులం బంగారం కూడా ఇస్తామన్నారని.. ఇచ్చారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. అప్పుడు ఎక్కడా పుట్టలేదని ఏ ముఖ్యమంత్రి అయినా అంటారా? అని నిలదీశారు. రాష్ట్రానికి సీఎం అయి ఉండీ ఇలా మాట్లాడుతారా? దొంగను దొంగ లెక్క చూడక మరెలా చేస్తారని ప్రశ్నించారు. ఎంతో మంది సీఎంలను చూశామని.. ఇలాంటి సీఎంను ఎక్కడా చూడలేదన్నారు. ఇస్తామన్న హామీలపై నిలదీస్తే.. నన్ను కోసుకు తింటారా? అని అంటున్నాడని.. బీఆర్ఎస్ హయాంలో కరోనా టైమ్‌లోనూ ఏ సంక్షేమ పథకం ఆపలేదని.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన వాటినే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. మనం కట్టిన ఫ్లైఓవర్లకు సున్నం వేసి ఇప్పుడు ప్రారంభిస్తున్నారన్నారు.

**మోదీ జీఎస్టీ తగ్గించి పండగ చేస్కో అంటున్నడు**

ప్రధాని మోదీ హెచ్1బీ వీసాల గురించి ఏమైనా చెప్తాడేమోనని అనుకున్నానని.. జీఎస్టీ తగ్గించి పండుగ చేసుకో అని చెప్తున్నారని ఆరోపించారు. మొన్నటిదాకా రక్తం తాగి.. ఇప్పుడు జీఎస్టీ తగ్గించి పండగ చేస్కో అంటే ఎలా? అని నిలదీశారు. నాడు గ్యాస్ ధర 450 ఉంటే.. ఇప్పుడు వెయ్యి దాటిందన్నారు. ముడి చమురు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గలేదని.. ఇస్తామన్న రెండుకోట్ల ఉద్యోగాలు ఎక్కడ? అని ప్రశ్నించారు. మతం పేరిట రాజకీయం చేయడం మాత్రమే బీజేపీకి, మోదీకి వచ్చునన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత హైదరాబాద్‌లో ఉచిత మంచినీళ్లు ఆపేస్తారని.. జూబ్లీహిల్స్ ఎన్నిక కోసం రాష్ట్రం మొత్తం ఎదురుచూస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్ల రూపంలో రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గతంలో జూబ్లీహిల్స్‌లో 4700 మెజారిటీ వస్తే ఈ సారి 10వేలు దాటాలన్నారు. అడ్డగోలు పైసలతో.. అలవిగాని హామీలతో ప్రమాణం చేస్తామని కాంగ్రెస్ నేతలు వస్తారని.. తప్పిదారి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని.. వాళ్లను ఎక్కడ కొట్టాలో అక్కడే కొట్టాలన్నారు. జూబ్లీహిల్స్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాపం..మాజీ డీఎస్పీ నళిని

**హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీ నళిని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. స్వరాష్ట్రం కసం తన ఉద్యోగాన్ని సైతం వదులుకుంది. ఉద్యమంలో పాల్గొన్నందుకు నాటి ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. తాజాగా నళిని ఆరోగ్యానికి సంబంధించిన విషయం అందరినీ షాక్ కు గురిచేసింది. చావు బతుకుల మధ్య నళిని కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో తన అనారోగ్యంపై ఫేస్ బుక్ లో పోస్ట్ చేసింది. తెలుగు రాష్ట్ర ప్రజలకు డీఎస్పీ నళిని బహిరంగ లేఖ ( వీలునామా/ మరణ వాంగ్మూలం)రాసింది. ఒక అధికారిణిగా, ఉద్యమకారిణిగా, రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవిక గా, ఆధ్యాత్మిక వేత్తగా సాగిన నా జీవితం ముగియబోతోంది. నాఆరోగ్య పరిస్థితి నెల రోజులుగా సీరియస్ గా ఉంది.ప్రస్తుతం క్రిటికల్ పొజిషన్ లో ఉన్నాను. మూడు(3)రోజుల నుండి నిద్ర లేదు. రాత్రంతా మహా మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తూ గడుపుతున్నాను. ఎనిమిది (8)ఏండ్ల క్రితం సోకిన రుమాటైడ్ ఆర్థ్రటీస్ అనే విలక్షణ కీళ్ల జబ్బు(= ఃశ్రీనీనీట ఇజీనిఇవతీ+ ఃనీనివ అజీనిఇవతీ) రెండు నెలలుగా టైపాయిడ్ , డెంగ్యూ, చికెన్ గున్యా వైరస్ల వల్ల తీవ్ర స్థాయికి చేరింది. కనకణం పేలిపోతున్నట్లు, ఏ కీలుకా కీలు విరిచేసినట్లు నొప్పి. తట్టుకోలేక పోతున్నాను.2018 లో ఈ జబ్బు ప్రారంభం అయినపుడు ఇలాంటి స్థితి యే ఏర్పడ్డపుడు,మొండి పట్టుదలతో ఏదో సాధించాలనే తపనతో హరిద్వార్ వెళ్ళి రాందేవ్ బాబా పంచకర్మ సెంటర్ లో నెలల తరబడి ఉంటూ నన్ను నేను బాగుచేసుకున్నాను. కానీ ఇప్పుడు నాకు అంత దూరం పోయేంత ఓపిక లేదు. నిరామయంలో చేరేంత డబ్బు లేదు. 25 ఏండ్ల క్రితమే నా శరీరం నాన్ స్టెరాయిడల్యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ కు సెన్సిటివ్ గా మారిపోయింది. నేను ఫార్మసిస్టు ను కూడా. కాబట్టి అలోపతి మందులకు ఎన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయో నాకు బాగా తెలుసు. కనుక 30 లోపు ఉండాల్సిన ఖీం ఫ్యాక్టర్ అత్యధికంగా 900 కు చేరినా స్టెరాయిడ్స్ వాడకుండా ఆయుర్వేదమే వాడుతూ, యోగ,ధ్యానం, వేదాధ్యయనం, యజ్ఞముల ద్వారా మామూలు మనిషిగా మీ అందరి ముందు కనిపించాను. కానీ గత కొన్ని నెలలుగా మళ్ళీ నాలో స్ట్రెస్ పెరుగుతూ వస్తుంది. దాని ప్రభావమే రకరకాల ఆరోగ్య రుగ్మతలు చుట్టుముట్టాయి.



ఇంగ్లీష్ మందులను వాడక తప్పని పరిస్థితి.వాటి సైడ్ ఎఫెక్ట్స్ నా పరిస్థితిని ప్రమాద స్థాయి కి చేర్చాయి.నా గతమంతా వ్యధ భరితం. తెలంగాణ ఉద్యమ పోరాటం వల్ల నా నిలువెల్లా గాయాలే అయ్యాయి. రాజీనామా ద్వారా నాటి ప్రభుత్వం పన్నిన పద్మవ్యూహం లోంచి బయట పడితే, డిపార్ట్మెంట్ నా వెన్నులో సస్పెన్షన్ అనే బల్లాన్ని కసితీరా దింపింది. సహాయం చేసేవాడు కనిపించక, నొప్పిని భరిస్తూనే 12 ఏళ్ల అజ్ఞాతవాసాన్ని అనుభవించాను. మహర్షి దయానందుని దయవల్ల ఒక చక్కని ఆధ్యాత్మిక మార్గాన్ని కనుగొని, అందులో విశేషమైన కృషి చేస్తూ, యజ్ఞ బ్రహ్మగా వివైపిఎస్ ( వేద యజ్ఞ పరిరక్షణ సమితి)సంస్థాపకురాలుగా ఎదిగి, హిందీ అభిమానులను కూడా సంపాదించుకొని,నా దారిని రహదారిగా పూల బాటగా మలచుకున్నాను. నళిని మళ్ళీ వికసించింది.ఇలాంటి తరుణంలో నేటి అఓ అధికారంలోకి రాగానే నా ఫైల్ ను ఎందుకో తెరిచారు. నాకేదో సహాయం చేస్తానని ప్రకటన చేశారు. వారిని కలిసి నా మనసులో మాట చెప్పాను. సస్పెన్షన్ పై విచారణ చేయించి ఇన్నేండ్లు ఇవ్వకుండా ఎగ్గొట్టిన సబ్సిస్టెన్స్ అల్లోవెన్స్ లెక్కకట్టి( సుమారు 2 కోట్లు) ఇవ్వండి అని అడుగుతూ 16 పేజీల స్వీయ లిఖిత రిపోర్ట్ ను ఇచ్చాను. వీలైతే వేద విద్యా కేంద్ర స్థాపనకు గ్రాంట్ కూడా ఇమ్మని అడిగాను.( రెండోది వారి పార్టీ పాలసీ కి విరుద్ధం. నేను హిందూ కాకపోయి ఉంటే వెంటనే గ్రాంట్ శాంక్షన్ అయి ఉండేది). 6 నెలల తర్వాత నా పిటిషన్ పొజిషన్ కనుక్కుంటే చెత్త బుట్ట పాలైంది అని తెలిసింది. నా ఆఫీస్ కాపీ ని మళ్ళీ స్కాన్ చేసి పంపాను. దానిపై ఇప్పటి వరకు స్పందన లేదు.మీడియా మిత్రులకు విజ్ఞప్తి. నేను చస్తే ఎవరూ సస్పెండెడ్ ఆఫీసర్ అని రాయకండి.రిజైన్డ్ ఆఫీసర్,కవయిత్రి ,యజ్ఞ బ్రహ్మ అని నన్ను సంభోదించండి. నా శరీరానికి జరగాల్సిన అంతిమ సంస్కారం వైదికంగా జరగాలి . బ్రతుకుండగా నన్ను తెలంగాణ పోరాట విషయంలో ఏ నాయకుడు సన్మానించలేదు. నేను చనిపోయాక అంటే పోస్టుమస్ అవార్డులు, రివార్డులు ఇవ్వడానికి బయలుదేరే రాష్ట్ర నాయకులకు ఒక వినతి.బ్రతుకుండగా నన్ను పట్టించుకొని మీరు రాజకీయ లబ్ధి కోసం నా పేరును వాడుకోవద్దు.ఒకవేళ నా ఈ ప్రస్తుత దయనీయ స్థితి మీలో ఎవరో ఒకరి ద్వారా కేంద్ర ప్రభుత్వ దృష్టికి చేరితే ,నాకు సరైన , ఖరీదైన వైద్యం అందితే నేను ప్రాణాపాయ స్థితి నుండి బయట పడతాను. లేదంటే . ..ఇంకా 3,4 పుస్తకాలు రచించాలని ,100 వీఐపీ యజ్ఞాలు పూర్తి చేయాలని, ఆధ్యాత్మిక కేంద్రం స్థాపించి విద్యార్థులకు శిబిరాలు నిర్వహించి సనాతన ధర్మాన్ని బోధించి వారిని ధర్మ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని, మోక్ష సాధన తీవ్రతరం చేయాలని ? ఇలాంటి నా కోరికలు ఈ జన్మలో తీరేలా లేవు. నా పేరు పై ఉన్న ఒక్కగానొక్క ఇంటి స్థలం వివైపిఎస్ కు చెందుతుంది. బ్రతుకుండగా దేశ ప్రధాని ని కలవలేక పోయాను. వారు కరుణామయులు. నా మరణానంతరం వారు నా లక్ష్య సాధన కోసం ఏమైనా ఇవ్వాలి అనుకుంటే మా వేదామృతం ట్రస్ట్ కు ఇవ్వవలసిందిగా మనవి. నా జీవితపు అంతిమ లక్ష్యమైన మోక్ష సాధనను మళ్ళీ జన్మలో కొనసాగిస్తాను అని పేర్కొంది.

# హాట్ టాపిక్‌గా కవిత వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు.. మళ్లీ హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావు గురించి ఆమె చేసిన ఆరోపణలు, అలాగే తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై వెల్లడించిన అంశాలు చర్చనీయాంశమయ్యాయి. హరీష్ రావుపై ఆరోపణలు. శనివారం మీడియాతో మాట్లాడిన కవిత, హరీష్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు భారీ అవినీతి చోటుచేసుకుందని ఆమె నేరుగా ఆరోపించారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావిస్తూ.. 2016లోనే నేను కేటీఆర్‌ను ఈ విషయంలో అలర్ట్ చేశాను, అని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాను అప్పుడే సమస్యలను చూపించినా, నిర్ణయాలు మాత్రం పూర్తిగా కేసీఆర్ పరిధిలోనే జరిగాయని అన్నారు. ప్రతి నిర్ణయం కేసీఆర్ దేనని హరీష్ రావు పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారనే విషయాన్ని కూడా గుర్తుచేశారు. హరీష్ రావుపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి విభేదాలు లేవని. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తప్ప మరే విషయంలోనూ నాకు ఆయనపై కోపం లేదు అని చెప్పి, తన విమర్శలు పూర్తిగా పరిపాలనా విధానాలకే సంబంధించినవని వివరించారు. కొత్త పార్టీపై కవిత వ్యాఖ్యలు. ఇటీవలి కాలంలో కవిత కొత్త పార్టీ స్థాపనపై చర్చలు ఎక్కువయ్యాయి. దీనిపై ఆమె క్లారిటీ ఇస్తూ కొత్త పార్టీ పెట్టాలా లేదా అనే అంశంపై నేను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అని చెప్పారు. రాజకీయంగా తన తదుపరి అడుగులపై అన్ని వర్గాల వారితో చర్చలు



జరుపుతున్నానని వివరించారు. ఒక వర్గం కోసం కాదు.. ప్రజలందరి కోసం పని చేయాలనుకుంటున్నాను.. బీసీ సమస్య నా మనసుకు దగ్గరైంది.. ప్రస్తుతం ఫ్రీ బర్డ్?ని.. నా ద్వారాలు తెరిచే ఉన్నాయి.. చాలా మంది వచ్చి నన్ను కలుస్తున్నారు.. నాతో టచ్?లో ఉన్న బీఆర్ఎస్ నేతల లిస్ట్ చాలా పెద్దది అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె తన తండ్రి కేసీఆర్ విధానాన్ని గుర్తు చేశారు. పార్టీ పెట్టేముందు కేసీఆర్ వందల మందితో చర్చలు జరిపారు. ప్రస్తుతం నేనూ అదే చేస్తున్నాను అని చెప్పారు. అంటే త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం కంటే, పరిస్థితులను సమీక్షించి తర్వాతే నిర్ణయం తీసుకుంటానని ఆమె అర్థం చేశారు. కాంగ్రెస్‌లో చేరే ఆలోచనలేదని స్పష్టం. కవిత మరోసారి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాన్ని పూర్తిగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన నాకు అస్సలు లేదు. కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. నేనూ కాంగ్రెస్‌లో ఎవరినీ అప్రోచ్ కాలేదు అని ఆమె స్పష్టంగా చెప్పారు. సస్పెన్షన్ అంశంపై వ్యాఖ్య. తండ్రి పార్టీ నుండి సస్పెండ్ అయిన తన పరిస్థితిని గుర్తుచేసుకుంటూ, తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతుర్ని నేనే అని అన్నారు. ఈ వ్యాఖ్య ద్వారా కుటుంబ రాజకీయ పరిణామాల్లో తనకు ఎదురైన కష్టాలను గుర్తు చేస్తూనే, ఆ అనుభవం తనను మరింత బలపరిచిందని సూచించారు. రాజకీయ పరిశీలన. కవిత తాజా వ్యాఖ్యలు రాజకీయ రంగంలో.. అనేక ప్రశ్నలను తెచ్చాయి. హరీష్ రావుపై అవినీతి ఆరోపణలు చేయడం ఒకవైపు బీఆర్ఎస్‌లో ఉన్న పాత విభేదాలను మళ్లీ తెరమీదకు తెచ్చింది. మరోవైపు కొత్త పార్టీ అంశంపై స్పష్టత ఇవ్వకుండా ఉంచడం, ప్రజలతో, మీడియాతో చర్చల్లో తన ప్రాధాన్యతను నిలుపుకోవడానికి ఒక వ్యూహంగా కనిపిస్తోంది. మొత్తానికి, కవిత వ్యాఖ్యలు ఒక వైపు బీఆర్ఎస్‌లోని అంతర్గత రాజకీయాలను కదిలిస్తే, మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో తన స్వంత స్థానం ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్న సంకేతాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే నెలల్లో ఆమె తీసుకునే నిర్ణయాలు రాజకీయ సమీకరణాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

## తెలంగాణ రైజింగ్ కోర్

## అర్బన్ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

జఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై పలు సూచనలు చేశారు ముఖ్యమంత్రి. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో వీధుల ఆధునీకరణ, సుందరీకరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు ముఖ్యమంత్రి. విద్యుత్ సబ్ స్టేషన్ల అప్ గ్రేడేషన్‌తో పాటు, విచ్చలవిడిగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను స్ట్రీమ్ లైన్ చేసి రీ–లొకేట్ చేయాలని దిశానిర్దేశం చేశారు సీఎం. మంచినీటి, మురుగునీటి వ్యవస్థపై నిర్వహణ వేర్వేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల విషయంలో వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## నళినికి మద్దతుగా నిలిచిన బిజెపి బృందం

-మొదటిపేజీ తరువాయి

నినాదంతో ఉద్యమానికి మద్దతు ఇచ్చి రాజీనామా చేశారన్నరు.నళిని రాజీనామా తర్వాత డిపార్ట్మెంట్ సస్పెండ్ చేసింది, కానీ ఇప్పటివరకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయలేదు.గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నళిని గారిని ఇబ్బందులకు గురిచేసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ, బెనిఫిట్స్ ఇంకా రిలీజ్ చేయలేదు.నళిని గారు 16 పేజీలలో రిపోర్ట్ సబ్మిట్ చేసి పరిస్థితులను వివరించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇతర కారణాలు చెబుతూ బెనిఫిట్స్ విడుదల చేయడం లేదు. ఫలితంగా నళిని గారు మానసిక వేదనకు గురయ్యారు. ఆరోగ్యం క్షీణించింది.ఇటువంటి పరిస్థితుల్లో నళిని కి మద్దతుగా నిలుస్తూ... బిజెపి బృందం ఆమెను పరామర్శించడం జరిగింది. నళిని గారు రిటైర్మెంట్ వేతనం, ఇతర అధికారిక ప్రయోజనాలను సమాజ సేవ కోసం వినియోగిస్తానని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రిటైర్మెంట్ ప్రయోజనాలను విడుదల చేసి, ఆమెను మానసిక వేదన నుండి బయటకు తీసుకోవాలి.ఒకవేళ ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ కోరితే, ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం కలిసేలా ప్రయత్నిస్తా నన్నారు.

## రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నుంచి బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం అంశంపై సమీక్షలో చర్చించారు ముఖ్యమంత్రి. వీలైనంత త్వరగా రూట్ మ్యాప్‌పై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్– శ్రీశైలం హైవేలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నుంచి వీలైనంత త్వరగా అనుమతులు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని దిశానిర్దేశం చేశారు. అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యల వివరాలను ఉన్నతాధికారులకు అందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## సిటీలో మరో స్కైవాక్...

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో పాదచారుల భద్రత, రవాణా సౌలభ్యం కోసం మరిన్ని స్కైవాక్‌లను నిర్మించడానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే ఉప్పల్‌లో స్కైవాక్ అందుబాటులోకి రాగా.. మెహిదీపట్నం స్కైవాక్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఇదే స్ఫూర్తితో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ జంక్షన్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోనూ కొత్త ప్రాజెక్టులకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టబోతోంది.హైదరాబాద్ నగరంలో తొలిసారిగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఉప్పల్ రింగ్‌రోడ్ వద్ద అత్యాధునిక స్కైవాక్‌ను నిర్మించారు. 660 మీటర్ల పొడవుతో, రూ.25 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ స్కైవాక్ పాదచారులకు రోడ్డు దాటడానికి మాత్రమే కాకుండా, సాయంత్రం వేళల్లో ప్రజల సందర్శనా కేంద్రంగా కూడా మారింది. ఉప్పల్ స్కైవాక్ సక్సెస్ కావటంతో.. హెచ్ఎండీఏ మెహిదీపట్నంలో 380 మీటర్ల పొడవైన స్కైవాక్‌ను రూ.34.86 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. డిఫెన్స్ భూముల సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ కొంత ఆలస్యమైనప్పటికీ.. దాని నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. మెహిదీపట్నంలో రోజూ లక్షలాది మంది ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు రద్దీగా ఉంటారు. ఈ స్కైవాక్ అందుబాటులోకి వస్తే పాదచారుల ఇబ్బందులు తొలగి, వారికి సురక్షితమైన ప్రయాణం సాధ్యమవుతుంది.నగరంలో అత్యంత రద్దీగా ఉండే కూకట్‌పల్లి జేఎన్‌టీయూ జంక్షన్ వద్ద పాదచారుల ఇబ్బందులను గమనించిన హెచ్ఎండీఏ.. ఇక్కడ కూడా స్కైవాక్‌ను నిర్మించాలని నిర్ణయించింది. ఈ కొత్త స్కైవాక్ జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ నుంచి లులు మాల్ వరకు సుమారు 600 మీటర్ల పొడవుతో నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను పీపీపీ పద్ధతిలో చేపట్టాలా లేక నేరుగా హెచ్ఎండీఏ ద్వారానే నిర్మించాలా అనే విషయాలపై అధికారులు ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ను సిద్ధం చేసి, నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లో ఉన్న మరో కీలకమైన రవాణా కేంద్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్. ఇక్కడ కూడా భారీ స్కైవాక్‌ను నిర్మించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లు పూర్తయితే హైదరాబాద్‌లో పాదచారుల భద్రత గణనీయంగా మెరుగుపడుతుంది. ఈ స్కైవాక్‌లు కేవలం రోడ్డు దాటడానికి మాత్రమే కాకుండా, నగర జీవనంలో అంతర్భాగంగా నిలిచిపోతాయి.

## రాజగోపాలరెడ్డి ఫ్రస్టేషన్ ఎందుకో...

**నల్గొండ :** కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమయం దొరికిన ప్రతిసారి తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను విభజిస్తున్నారు. ప్రభుత్వ పథకాలలో అవినీతిని ఎండగడుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు పట్ల ఎప్పటికప్పుడు తనదైన శైలిలో విమర్శలు చేస్తున్నారు. దీని వెనుక ఉన్న ప్రధాన కారణం ఆయనకు మంత్రి పదవి ఇవ్వకపోవడమే.మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ తనకు హామీ ఇచ్చిందని.. ఆ తర్వాత దానిని విస్మరించిందని రాజగోపాల్ రెడ్డి ఇటీవల తరచూ ఆరోపిస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇస్తానని ఆశ చూపి ఇలా మోసం చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన పరోక్షంగా పేర్కొంటున్నారు. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఆయన మొహమాటం లేకుండా బయటపెడుతున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే కీలక వ్యాఖ్యలు చేశారు రాజగోపాల్ రెడ్డి. పదవులు ఎలాగో ఇవ్వలేదు కనీసం నియోజకవర్గం అభివృద్ధికి నిధులు అయినా ఇవ్వండి అంటూ వ్యాఖ్యలు చేశారు. పదవులు మీకే పైసలు మీకే అని కొద్దిరోజుల క్రితం అన్నాను... ఎవరినన్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి ని అన్నాను తెలుసు కదా అని కార్యకర్తలతో కోమటిరెడ్డి అన్నారు. మన మునుగోడులో నియోజకవర్గంలో రోడ్డు కాంట్రాక్టర్లకు సిసి రోడ్డు కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి నిధులు కూడా రావడం లేదు. నేను మంత్రి దగ్గర పోయి అడిగినా కూడా రాలే.. వందసార్లు తిరిగినా రాలేదు అంటూ ఆయన మండిపడ్డారు. కాంట్రాక్టర్లు వలిగొండ చౌటుప్పల్ రోడ్డు చేయడం లేదు... పని చేయమంటే కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించమని అంటున్నారు అన్నారు కోమటిరెడ్డ రాజగోపాలరెడ్డి. బిల్లు ఏమో నా చేతిలో లేదు...ముఖ్యమంత్రి చేతిలో ఉంటుంది. నేను ముఖ్యమంత్రిని విమర్శించలేదు.. పార్టీని విమర్శించలేదు..కానీ ప్రజలు నన్ను పని చేయమని అడుగుతున్నారు. పదవులలో మీరే ఉంటారు..పైసలూ మీరే తీసుకుంటారు. మీ నియోజకవర్గాలకు పైసలు పోతున్నాయి... కనీసం నాకు పదవి ఇవ్వనందుకు మా నియోజకవర్గానికి డబ్బులు అయినా ఇవ్వండి అని కోమటి రెడ్డి విమర్శించారు. నన్ను ఎన్నుకున్న ప్రజలకు అన్యాయం చేయకండి.. మునుగోడు నియోజకవర్గం సహకరించండి అంటూ విజ్ఞప్తి చేశారు.

## సంపాదకీయం

# గేమ్ ఛేంజర్‌గా జీఎస్టీ సంస్కరణ

పెద్ద నోట్ల రద్దు, కరోనా పీడ దినాలు.. ఇలా అనేక సందర్భాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన అలా ప్రసంగించిన ప్రతి సందర్భంలోనూ సంచలన విషయాలను పంచుకున్నారు. ఆ విషయాలన్నీ జాతిని జాగృతం చేసే దిశగా నడిచాయి. విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. తాజాగా నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈసారి కూడా సంచలన విషయాలను పంచుకున్నారు.అమెరికా హెచ్ వన్ బీ వీసాల మీద తీసుకున్న నిర్ణయం.. ఓట్ చోరీ.. నేపాల్ దేశంలో ఆందోళనలు.. ఇన్ని పరిణామాల మధ్య నరేంద్ర మోడీ ఏదో ఒక కీలక విషయాన్ని వెల్లడిస్తారని.. సంచలన విషయాలను ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. దానికి తగ్గట్టుగానే నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. సంచలన విషయాలను వెల్లడించారు.. ఇటీవల కాలంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారతదేశంలో కూడా నేపాల్ మాదిరిగానే జెడ్ జనరేషన్ ఉద్యమం వస్తుందని వ్యాఖ్యానించారు . ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. ఏ క్షణమైనా సరే మనదేశంలో పెను ప్రకంపనలు చోటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మాటలు ఏ రాజకీయ నాయకుడు అన్నా పెద్దగా పట్టింపు ఉండేది కాదు. రాహుల్ గాంధీ ఈమాటలు అనడంతో సాధారణంగానే చర్చ మొదలైంది. దీనిపై బీజేపీ కూడా ఘాటుగానే స్పందించినప్పటికీ.. మోడీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. దేశంలో నవరాత్రి ఉత్సవాలు మొదలవుతున్నాయి. దాంతోపాటు జీఎస్టీ బచత్ ఉత్సవం కూడా మొదలవుతుంది. ఐదు శాతం, 18% జివిస్టి స్లాబులు మాత్రమే అమల్లోకి వస్తాయి. దీంతో ప్రతి ఇంట్లో సంతోషం వెల్లి విరుస్తుంది. ఈ సంస్కరణ భారతదేశ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంది. ఆత్మనిర్భర్ దిశగా ఇది కీలకమైన ముందడుగు. గతంలో ప్రతి చోట రకరకాల పన్నులు విధించేవారు. ప్రజలను ఇబ్బందులు పెట్టేవారు. ప్రజలను గందరగోళం నుంచి బయటపడడానికి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. వన్ నేషన్ వన్ టాక్స్ స్వప్నం సాకారం అయింది. సరికొత్త చరిత్ర సృష్టించేందుకు ఈ సంస్కరణలు తోడ్పడతాయి. ఫలితంగా పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుందని నెక్స్ట్ జెన్ జీఎస్టీ ఉత్సవం ప్రారంభమవుతుందని" నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రాహుల్ గాంధీ సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ జనరేషన్ జెడ్ తరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. వారిలో నేపాల్ తరహాలో ఉద్రేకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మాత్రం అలాంటివి చేయకుండా ఈ జనరేషన్ కు జీఎస్టీ మార్పుల వల్ల లాభం జరుగుతుందని పేర్కొన్నారు. యువత వల్లే దేశం ఈ స్థాయిలో ఉందని.. వారి కోసం ఏమైనా చేస్తామని ప్రకటించారు. తద్వారా రాహుల్ గాంధీ ఆశలపై నీళ్లు చల్లారు నరేంద్ర మోడీ.జీఎస్టీ స్వరూపంలో కేంద్రం కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇకపై స్టాండర్డ్ , మెరిట్ పేరుతో జీఎస్టీలో రెండే శ్లాబులు ఉంటాయి. వాటిలో ఒకటి 5% కాగా రెండోది 18%.గుట్కా, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లపై మినహా మిగిలిన ఉత్పత్తులపై పన్ను మార్పులు అమల్లోకి వచ్చాయి. తలనూనెలు, కార్న్‌ఫ్లేక్స్, టీవీలు, వ్యక్తిగత ఆరోగ్య ఉత్పతులు వంటివాటిపై పన్ను తగ్గనుంది. రోటీ, పరోటాలపై జీఎస్టీ సున్నా. ప్రాణాధార ఔషధాలపై ఎటువంటి పన్ను లేదు. ఖరీదైన కార్లు, పొగాకు ఉత్పత్తులు-సిగరెట్లపై ప్రత్యేకంగా 40 శాతం స్లాబును ప్రతిపాదించారు. దాదాపుగా వ్యక్తిగత వస్తువులన్నింటికీ పన్ను తగ్గించడం ద్వారా దేశీయ వినిమయాన్ని పెంచి.. అమెరికా సుంకాల భారం నుంచి కొంత ఉపశమనం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశీయ వాణిజ్యాన్ని పరుగు పెట్టించేందుకు, వినియోగాన్ని గణనీయంగా ప్రోత్సహించే దిశగా నిర్ణయాలు తీసుకున్న జీఎస్టీ మండలి.. పండగ సీజన్‌ను మరింత ఉత్సాహభరితంగా మార్చింది. వ్యక్తిగత, ఆరోగ్య బీమా పథకాలపై జీఎస్టీ రద్దు చేయడం.. కోట్ల మందికి బీమాను చేరువ చేసేందుకు ఉపయోగపడనుంది. అన్ని నిర్ణయాలనూ ఏకాభిప్రాయంతో తీసుకున్నామని, ఏ ఒక్క రాష్ట్రం వీటిని వ్యతిరేకించలేదని నిర్మలా సీతారామన్ తెలిపారు.సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరచడం, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై స్థూలంగా ఒక ప్రతిపాదనను కేంద్రం రూపొందించింది. దీనిపై జీఎస్టీ మండలి ఉమ్మడిగా నిర్ణయం తీసుకుంది. జీఎస్టీ రేట్లలో కొత్త మార్పులతో చిరు వ్యాపారులు, రైతులు, మధ్యతరగతి, మహిళలు, యువతకు మేలు జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా ఇన్సూరెన్స్ రంగానికి జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అన్ని రకాల హెల్త్, లైఫ్, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ క్రమంలో ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గుతుంది బీమా రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ తగ్గింపు పూర్తిస్థాయిలో అమలు కాకపోవచ్చనే అంచనాలూ లేకపోలేదు. రాష్ట్రాల ఆదాయాన్ని 14 శాతం పెంచి, రక్షించాలని జీఎస్టీ విధానాన్ని రూపొందించగా.. గత అయిదేళ్లలో రాష్ట్రాలు రూ.63,265 కోట్లు అదనంగా పొందాయని తెలిపింది. జీఎస్టీ ఆదాయం పెంచుకోవడం ద్వారా ప్రతి రూ.100 జీఎస్టీలో రాష్ట్రాలకు దాదాపు రూ.70.5 వస్తున్నట్లు వివరించింది. జీఎస్టీ ప్రవేశ పెట్టినప్పుడు రాష్ట్రాలకు అయిదేళ్ల వ్యవధిలో 14 శాతం వార్షిక ఆదాయ పెరుగుదలకు హామీ ఇచ్చారు. విలాస వస్తువులు, హానికర ఉత్పత్తులపై సెస్ వసూలు చేసి, ఆదాయ లోటును భర్తీ చేస్తామనీ పేర్కొన్నారు. కానీ, కరోనా మహమ్మారి కారణంగా ఆదాయ లోటు పెరిగింది. కేంద్రం రూ.2.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుని, ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు అందించింది. మొత్తంగా రాష్ట్రాలు రూ.9.14 లక్షల కోట్ల పరిహారం పొందాయి. ఇది హామీ ఇచ్చిన మొత్తంతో పోలిస్తే రూ.63,265 కోట్లు అధికమని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రాలు జీఎస్టీ పేరంగా నికర ఆదాయంతోనే ఉంటాయని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. 9.5 శాతం నికర జీఎస్టీ రేటుతో అదనంగా రూ.52,000 కోట్ల ఆదాయం వస్తుందని, దీంట్లో రాష్ట్రాలకు, కేంద్రానికి రూ.26,000 కోట్ల చొప్పున వస్తుందని వివరించింది. రాష్ట్రాల వారీగా అంచనాలు కూడా నివేదికలో పేర్కొంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ అంచనా ఆదాయం రూ.35,863 కోట్లుగా ఉండగా, జీఎస్టీ సవరణ అనంతరం రూ.52,622 కోట్ల వరకూ ఆదాయం లభిస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. అంటే, రూ.16,759 కోట్ల వరకూ ఆదాయం పెరగనుందని పేర్కొంది. తెలంగాణ విషయానికి వస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ఆదాయం రూ.42,075 కోట్లు వచ్చే అవకాశం ఉండగా, సవరణ తర్వాత రూ.8,705 కోట్లు అదనంగా మొత్తం రూ.50,779 కోట్లు రావొచ్చని నివేదిక వెల్లడించింది. గతంలో జులై 2018, అక్టోబరు 2019లో రేట్లు తగ్గించినప్పుడు తాత్కాలికంగా 3-4% రాబడి తగ్గినా తర్వాత 5-6% వృద్ధితో రాష్ట్రాలకు మరింత ఆదాయం వచ్చిందని పేర్కొంది. మొత్తంగా రూ.లక్ష కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని పేర్కొంది. జీఎస్టీ వ్యవస్థ గిరాకీని పెంచడమే కాకుండా, పన్ను వ్యవస్థను సరళీకరించిందని తెలిపింది.గత ఎనిమిదేళ్ల జీఎస్టీ ఆదాయాన్ని విశ్లేషించినా అంత కంగారు పడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో జీఎస్టీ ప్రవేశపెట్టినప్పుడు కూడా పలురకాల పన్నులు ఎత్తేసి.. ఒకటే పన్ను అంటే ఆదాయం తగ్గుతుందని భయపడ్డారని గుర్తుచేశాయి. కానీ వాస్తవం వేరేగా ఉందని గణాంకాలు రుజువు చేశాయని తెలిపాయి. జీఎస్టీ ఆదాయ స్థిరీకరణకు కాస్త సమయం పట్టిందని, ఒక్కసారి జీఎస్టీ ఆదాయ స్థిరీకరణ జరిగిన తర్వాత.. పన్ను వసూళ్లు క్రమంగా పెరిగాయని విశ్లేషించాయి. ఇప్పుడు కూడా నష్టాలు, వాటిని పూడ్చుకోవడంపై పక్కా అంచనాలు వేసుకున్నాకే.. కేంద్రం జీఎస్టీ హేతుబద్ధీకరణ నిర్ణయం తీసుకుందని చెబుతున్నాయి.

# విప్లవమా.. సాధ్యమా?





నేపాల్‌లో అరాచక విప్లవంతో పార్లమెంటు, సుప్రీంకోర్టును తగులబెట్టి, పాలకులను సజీవంగా దహనం చేసిన తరువాత చాలామంది చిత్రమైన మేధావులు ఇండియాలో కూడా ఇలాంటి విప్లవం వస్తుందా? అనే చర్చలు సాగిస్తున్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పక్షం అందరికీ నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. కానీ ఈ దేశంలో నేపాల్ తరహా విప్లవం ఎప్పటికీ రాదు. నేపాల్ అనేది మన దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఒక రాష్ట్రం లాంటిది. ఒక రాష్ట్రంలో నేపాల్‌ను మించిన విధ్వంసం జరగవచ్చు.. కానీ ఇది సువిశాల భారతదేశం. ఇక్కడ ఏదో ఒక రాష్ట్రంలో అల్లర్లు చెలరేగినంత మాత్రాన దేశంలో నేపాల్ లాంటి విప్లవం వస్తుందని కలలు కంటే దేశం గురించి అవగాహన లేనట్టే. ఒకవైపు నేపాల్ తరహా విప్లవం గురించి చర్చలు జరుగుతున్న సమయంలోనే మావోయిస్టుల నుంచి ఆసక్తికరమైన ప్రకటన వచ్చింది. రెండుమూడు దశాబ్దాల క్రితం జర్నలిస్టులు నక్సల్ నాయకుడిని ఇంటర్వ్యూ చేసి వస్తే హీరో ఇమేజ్ వచ్చేది. నక్సల్ నాయకుడి ఇంటర్వ్యూ మీడియాలో హైలైట్ అయ్యేది. అలాంటిది మావోయిజానికి ఆయుధం ఊపిరి లాంటిది. అలాంటి ఊపిరినే వదిలేస్తాం అని మావోయిస్టులు ప్రకటిస్తే మీడియాలో పెద్దచర్చలు లేవు. ఒకరోజు మామూలు వార్త తప్ప అంతకుమించి ప్రచారం లేదు. ఒకవేళ ఈ ప్రకటన మావోయిస్టుల పేరుతో ఎవరో విడుదల చేసిన తప్పుడు ప్రకటనా? అనే అనుమానం రావడం సహజం. అలా తప్పుడు ప్రకటన అయి ఉంటే అదేరోజు లేదా మరుసటి రోజు 'ఆ ప్రకటన మేం విడుదల చేయలేదు, తప్పుడు ప్రకటన' అని మావోయిస్టులు ఖండన విడుదల చేసేవారు. సెప్టెంబర్ 17న ప్రకటన విడుదలైతే ఐదురోజులు గడిచినా వారి నుంచి ఖండన ప్రకటన రాలేదు. కాబట్టి అది మావోయిస్టుల ప్రకటన అనే నిర్ధారణకు రావచ్చు. ఆయుధ పోరాటాన్ని నిలిపివేసి, శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు అధికార ప్రతినిధి అభయ్ ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లేదా వారి ప్రతినిధులతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు మావోయిస్టులు ప్రకటించారు. దీనిపై కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఈ ప్రకటనకు ముందే అమిత్ షా గతంలో దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉంటే ఇప్పుడు ఆరుకు పడిపోయాయని, 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించనున్నట్టు ప్రకటించారు. నక్సలిజం సంపూర్ణ నిర్మూలనకు కేంద్రం దూకుడుగా వ్యవహరిస్తుండటం తో కొంత ఊపిరి పీల్చుకొనే అవకాశం కోసం మావోయిస్టులు ఆయుధాలు వదిలి శాంతి చర్చలకు సిద్ధం అవుతున్నట్టు భావించవచ్చు.

అయితే 'పూర్తిగా నిర్మూలించే అవకాశం చేతిలో ఉన్నప్పుడు చర్చలు ఎందుకు? సమస్యను శాశ్వతంగా లేకుండా చేసుకోవాలి' అనేది కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం కావచ్చు. అందుకే స్పందించడం లేదేమో. నేపాల్‌లో కూలిపోయిన ప్రభుత్వం అంతకుముందు తీవ్రవాదాన్ని నమ్ముకొన్న నక్సలైట్లదే. ఓ రెండు మూడు దశాబ్దాల క్రితం ఆంధ్రప్రదేశ్ నేపాల్ కారిడార్, శ్రీలంక కారిడార్ అంటూ నక్సల్స్‌కు సంబంధించిన వార్తలు తెలుగు మీడియాలో సైతం తెగ కనిపించేవి. ఆంధ్రప్రదేశ్ %-% నేపాల్ మావోయిస్టుల మధ్య బంధం ఎంత బలంగా ఉండేదో కానీ తెలుగు మీడియాలో మాత్రం వీరి బంధంపై కథలుకథలుగా వార్తలు కనిపించేవి. నక్సల్స్ చేతికి అధికారం వస్తే ఎలా పాలిస్తారో నేపాల్ పాలకులు బాగా అర్థం అయ్యేట్టు చూపించారు.

ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలు ఉన్నా ప్రజలకు తమ ఓటు ద్వారా పాలకులను శిక్షించే అవకాశం ఉంటుంది. మార్చే అవకాశం ఉంటుంది. ప్రజల అభిమానం పొంది అధికారంలోకి రావడం వేరు, ఆయుధం చేపట్టి భయపెట్టి అధికారం చెలాయించడం వేరు. నేపాల్‌లో నిరుద్యోగం, అవినీతి పెరిగిపోవడం, అదే సమయంలో పాలకుల పిల్లల విచ్చలవిడి జీవన విధానం నేపాల్ నవతరాన్ని విప్లవానికి ప్రేరేపించింది. మన దేశంలో అవినీతి లేదా? నాయకులు, వారి పిల్లలు విలాసవంతమైన జీవితం గడపటం నిజం కాదా? అంటే నేపాల్‌ను మించిన అవినీతి ఉండవచ్చు, నాయకులు, అధికారులు, వారి సంతానం అంతకుమించి అక్రమ సంపాదనతో విలాసవంతమైన జీవితం గడుపుతూ ఉండవచ్చు. అయినా ఇక్కడ విప్లవం రాదు. దేశంలోని మెజారిటీ ప్రజలు సంస్కరణలను స్వాగతిస్తారు. ఈ దేశం జీన్స్‌లోనే మార్పునకు, సంస్కరణలకు స్వాగతం పలికే తత్త్వం ఉంది.మార్పునకు స్వాగతం పలికే తత్వం, సంస్కరణలను స్వీకరించే తత్వం ఉన్న చోట విప్లవానికి అవకాశం లేదు. అత్యవసర పరిస్థితిని దేశమంతా వ్యతిరేకించి, శక్తివంతమైన నాయకురాలు ఇందిరాగాంధీని సైతం ఓడించారు. రెండేండ్లు గడిచిన తర్వాత అదే ఇందిరాగాంధీని అందల మెక్కించారు. నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక తరహాలో పాలకులను హత్య చేయడం, ఉరి తీయడం, పార్లమెంట్ భవనాన్ని తగులబెట్టడం ఇక్కడ ఊహించలేం. లోపాలుంటే ఉండవచ్చు, నిరక్షరాస్యత ఉండవచ్చు. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం ఎంతో కొంత పరిణతి చెందింది. పార్లమెంటు, సుప్రీంకోర్టు అంటే మనకు దేవాలయాలంత పవిత్రమైనవి. మరోవైపు ఆర్థిక సంస్కరణల తర్వాత దేశంలోని యువతలో ఎక్కువగా కెరీర్ పట్ల ఆసక్తితో పెరిగింది. తెలంగాణలో ఒకప్పుడు తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉండేది. ఆర్థిక సంస్కరణల తరువాత పూర్తిగా మారింది. గతంలో తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్లినా తీవ్రవాదుల ప్రభావం కనిపించేది. ఇప్పుడు తెలంగాణలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో మంచి ఉద్యోగాల్లో ఉన్న యువత గురించి వింటున్నాం. అంతేకాకుండా మన దేశంలోని ఒక రాష్ట్రం అంత ఉండే నేపాల్‌లో విప్లవం పేరుతో అరాచకం సాధ్యమైంది. కానీ, సువిశాల భారతదేశంలో సాధ్యం కాదు. మణిపూర్, పంజాబ్, కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో కొన్ని అరాచక సంఘటనలు జరగకపోలేదు. ఇలాంటి సంఘటనలు ఆ ఒక్క రాష్ట్రమే కాదు మొత్తం దేశం తన శక్తిని ఉపయోగించి అణచివేస్తుంది. అందువల్ల నేపాల్ విప్లవ ప్రభావం మీడియా వార్తల్లో తప్ప ప్రజల్లో పెద్దగా ఉండదు. ఇప్పుడు యువత అడవుల గురించి కాదు కెరీర్ గురించి ఆలోచిస్తోంది.

# దయనీయుడు కాకూడదు!



'మానవుడే మహనీయుడు, శక్తియుతుడు, యుక్తిపరుడు, మానవుడే మాననీయు'డంటాడు కవి ఆరుద్ర ఒక సినీ గీతంలో! సందేహమేముంది? ఆయనే అన్నట్టు, మంచిని తలపెడితే మనిషికి అడ్డే లేదు, దివిజ గంగ భువి దించిన భగీరథుడు మానవుడే, సృష్టికి ప్రతిసృష్టి చేయు విశ్వామిత్రుడు నరుడేబీ చంద్రలోకమైన, దేవేంద్రలోకమైన బొందితో జయించి భువికి తిరిగి రాగలిగినవాడూ మానవుడే! కానీ, అంతటి మహనీయుడు కూడా ఒక్కోసారి దయనీయుడై పోతాడు. ఎంతో ముందుకు చూడగలిగి కూడా తరచూ హ్రస్వ దృష్టికి లోనవుతాడు. పదిమందికీ మంచిని తలపెట్టేవాడు కూడా స్వప్రయోజనాన్ని మరిగి చివరికి సొంతానికే చేటు తెచ్చుకుంటాడు. సర్వతోముఖ వికాసం మనిషికి వరమే కానీ, తనకు తనే చెరుపు చేసుకునే బహుముఖ వైఫల్యం పెనుశాపం. అసాధారణ వర్షాల కారణంగా హిమాలయ ప్రాంత రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. హఠాత్తుగా అతివృష్టి, మెరుపు వరదలు, మట్టిపెళ్ళలు విరిగిపడటం వగైరా ఉత్పాతాల కారణంగా ఈ సంవత్సరం ఇప్పటికి దాదాపు మూడు వేల మంది మరణించారు, లక్షల కోట్ల విలువైన ఆస్తినష్టం సంభవించింది. అడ్డూ అదుపూ లేని పట్టణాభివృద్ధి, అడవుల నిర్మూలన, రోడ్ల నిర్మాణం, విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన అభివృద్ధి చర్యలను ఇందుకు కారణంగా పర్యావరణ వాదులు ఎత్తిచూపుతున్నారు. ఇటువంటివి లేని రోజుల్లో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగిన సంగతిని కొందరు ఉదాహరిస్తున్నారు. కారణమేమైనా ప్రాణనష్టం, ఆస్తినష్టం కళ్లముందు కటిక నిజాలు. పటిష్ఠమైన ముందస్తు హెచ్చరిక యంత్రాంగాన్ని ఇప్పటికీ ఏర్పరచుకోలేక పోవడం %-% దీనంతటి వెనుకా మహనీయుడైన మానవుడి పరంగా చెప్పుకోవలసిన ఒకానొక వైఫల్యం. దీనికితోడు, దేశంలో ప్రకృతి విపత్తులకు గురికాగల ప్రాంతాల గురించిన గణాంకాలు గుండె గుభేలుమనిపిస్తాయి. ఏకంగా 27 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలూ ఇందులోకి వస్తాయి. వ్యవసాయ యోగ్యమైన 68 శాతం భూమి ఏ క్షణంలోనైనా అనావృష్టికి గురికావచ్చు, 15 శాతం ప్రాంతంలో ఉన్నట్టుండి రాళ్ళవర్షం కురవచ్చు, 12 శాతం ప్రాంతంలో మెరుపు వరదలు సంభవించవచ్చు. ఈ విపత్తులు ఏటా పెరగడమే తప్పే తగ్గే అవకాశం లేదట! శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధిలో మానవుడి బుద్ధి ఎంతో చురుగ్గా పని పనిచేయడం ఎంతైనా శ్లాఘనీయమేబీ అభివృద్ధిని ప్రజలకు మరింత సుఖమయ జీవన యోగ్యంగా మలచే దిశగా శరవేగంతో కదలడమూ అభినందనీయమేబీ కానీ, దానిని అంటిపెట్టుకుని వచ్చే సమస్యల నివారణలో మాత్రం అతని అడుగు చురుగ్గా పడటం లేదు. దాంతో అభివృద్ధి అస్తవ్యస్తానికీ, అభద్రతకూ చిరునామా అవుతోంది. దేశంలోని మహా నగరాలలో రోడ్ల పరిస్థితే ఇందుకు మరో ఉదాహరణ. ఆయా నగరాలలో జనాభా పెరుగుదలా, కొత్త జనావాసాల విస్తరణా, రాకపోకల అవసరాలూ, వాహనాల పెంపూ విమాన వేగాన్ని అందుకున్నాయిబీ కానీ, ఆ దామాషాలో రోడ్ల నిర్వహణా, ఇతర వసతుల కల్పనలో ప్రభుత్వాల ప్రణాళికలు ఎడ్లబండి వేగంతో నడుస్తున్నాయి. అనేక నగరాలలో రాకపోకల రద్దీ ఎంతటి సమస్యాత్మక స్థాయికి చేరిందంటే, జనం గంటల తరబడి కాలాన్ని ట్రాఫిక్ జామ్ లోనే గడపవలసి వస్తోంది, ఎంతో విలువైన ఉత్పాదక సమయం రోడ్లపాలైపోతోంది.

రకరకాల జీవనోపాధి పనుల మీద తిరిగే జనాలను అది మానసికంగా విపరీతమైన ఒత్తిడికి గురిచేసి ఆర్థిక సమస్యలతోపాటు ఆరోగ్య సమస్యలనూ తెచ్చిపెడుతోంది. ఈ ఏడాది తొలి అయిదారు మాసాల్లోనే దేశవ్యాప్తంగా నగరాల రోడ్లపై సంభవించిన దుర్ఘటన మరణాలు వేలసంఖ్యను దాటిపోయాయి. అయినాసరే, పౌరరవాణా సదుపాయాల అభివృద్ధీ వగైరాలు కాగితాల దశను దాటి కార్యరూపం ధరించడానికి ఏళ్లూపూళ్లూ పట్టిపోతోంది. మొత్తంమీద కవి చెప్పినట్టు గ్రహరాశుల నధిగమించి ఘనతారల పథము తొక్కగలిగిన మహనీయుడే తన లోకాన్ని సర్వతోభద్రంగా మార్చుకోవడంలో విఫలమవుతున్నాడు. మనిషి జైత్రయాత్రలో ఎక్కడో అడుగు తడబడి అపజయపు దారి పడుతోంది. తనను దయనీయుడిగా రూపుకట్టే ఆ తడబాటును సరిదిద్దుకుని మహనీయుడన్న ఖ్యాతి నిలుపుకోవడం మనిషి తక్షణావసరం

http://www.agnidharanews.com
అగ్నిధార
నిజాల నిప్పు కణిక

## మంగళవారం నుంచి తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నమెంట్

**హైదరాబాద్ :** ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం నుండి 26 వ తేదీ వరకు తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నమెంట్ జరగనుంది. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ లో ఎన్ఎస్ఎల్ లక్సీ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టోర్నమెంట్ ట్రోఫీని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి వి కె రాజు ,ఖఉఎ అఖా అమన్దీప్ జోహ్లా క్రీడాకారులతో కలిసి లాంచ్ చేశారు . ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన గోల్ఫ్ క్రీడాకారులకు కోటి రూపాయల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు అమన్ దీప్ తెలిపారు .ఈ టోర్నమెంట్ లో ఒలంపిక్స్ లో పాల్గొన్న క్రీడాకారులతో పాటు జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు .

## 100 కోట్ల భూమి అక్రమ రిజిస్ట్రేషన్

**రంగా రెడ్డి :** అబ్దుల్లాపూర్ మెట్టు లో 100 కోట్ల విలువైన లక్ష గజాల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ అయినట్లు సమాచారం.. స్థానిక బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, బ్యాంకు ఉద్యోగి సహా పలువురి పేర్ల పై అక్రమ రిజిస్ట్రేషన్ అయినట్లు సమయాచారం. నకిలీ ఆర్డీవో ప్రొసీడింగ్ ద్వారా అబ్దుల్లాపూర్ మెట్టు సబ్ రిజిస్టర్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించారు. బాటసింగారం రెవెన్యూ పరిధి 376 లో 223 ఎకరాల్లో శ్రీమిత్ర డెవలపర్స్ భారీ వెంచర్ నిర్మాణం జరిగింది. శ్రీమిత్ర డెవలపర్స్ ప్రజా ప్రయోజనార్థం వదిలివేసిన లక్ష గజాల భూమిని స్థానిక లీడర్లు మింగేసారు. నకిలీ ఆర్డీవో ప్రొసీడింగ్ తో శ్రీమిత్ర డెవలపర్స్ డైరెక్టర్ దశరథ రామయ్య ద్వారా రిజిస్ట్రేషన్ జరిగింది. నకి ఆర్డీవో ప్రొసీడింగ్ అని అబ్దుల్లాపూర్ మెట్టు రెవెన్యూ అధికారులు తేల్చారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్ మెట్టు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు. శ్రీమిత్ర డెవలపర్స్ డైరెక్టర్ దశరథ రామయ్య పైన కేసు నమోదు అయింది. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థానిక బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,బ్యాంకు ఉద్యోగిలను గుర్తించారు.

## యాదగిరిగుట్ట 34 రోజుల హుండీ ఆదాయం రూ. 2 కోట్ల 83 వేలు

**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు .ఆలయ ఈవో వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం...34 రోజుల హుండీ మొత్తం నగదు రూపేణా ? 2,00,83,825-00(రెండు కోట్ల ఎనభై మూడు వేల ఎనిమిది వందల ఇరువై ఐదు రూపాయలు ) వచ్చింది.మిశ్రమ బంగారం: 65-500 గ్రాములు, మిశ్రమ వెండి: 2 కిలోలు 800 గ్రాములు వచ్చినట్లు వివరించారు.విదేశీ కరెన్సీ విరాళం అమెరికా ? 540 డాలర్లు, ఇంగ్లాండ్ ?95 పౌండ్లు, నేపాల్ ? 10 రూపాయలు, సౌదీ అరేబియా ? 6 రియాల్, ఒమన్ ? 401 రియాల్, మలేసియా ? 40 రింగ్గిట్స్,యూరో ? 5 యూరోలు,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ - 155,కెనడా ? 70 డాలర్, ఇరాక్ - 250 దినార్ లు మొక్కు భక్తుల ద్వారా వచ్చినట్లు వివరించారు.

## స్టేడియం కోసం స్థలం కేటాయించండి

**మంత్రి శ్రీహరిని కోరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం క్రిడల నిర్వహణ కు ఇరుకుగా మారిందని చల్ గల్ వాలంతరిలో 10 ఎకరాల స్థలం స్టేడియం కోసం కేటాయించాలని క్రీడలు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకటి శ్రీహరిని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కోరారు. సోమవారం హైదరాబాద్ వెళ్లిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మంత్రి ఆఫీస్ కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. జగిత్యాల పట్టణం నడి మధ్యలో ఉన్న వివేకానంద మినిస్టేడియం మధ్యలో ఇండోర్ స్టేడియం ఉండడంతో ఇరుకుగా మారిందన్నారు. జగిత్యాల జిల్లా కావడం తో నిర్వహిస్తున్న క్రిడలకు మైదానం సరిపోవడం లేదని పేర్కొన్నారు. చల్ గల్ వాలంతరిలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే మినిస్టేడియం నిర్మాణం చేయిస్తే జగిత్యాల, రాయి కల్, కోరుట్ల, కథలాపూర్, ధర్మపురి ప్రాంతాల ప్రజలకు, క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. వాలంతరి కి చైర్మన్ ముఖ్యమంత్రి ఉండడం, అలాగే సి. ఎం సలహాదారులు వేం నరేంధర్ రెడ్డిని కూడా గతంలో కోరడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన విజ్ఞప్తి కి మంత్రి శ్రీహరి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## త్వరలోనే ముత్యం పేట చక్కర ఫ్యాక్టరీ తెరుస్తాం

**మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి**



**కోరుట్ల :** గత పాలకుల హాయంలో మూతపడ్డ ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీని సాధ్యమైనంత త్వరలోతెరిపించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తెలిపారు.సోమవారం నియోజకవర్గంలోని మెట్ పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ ముత్యం పేట చక్కర ఫ్యాక్టరీని పున ప్రారంభించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోవాల్సిన అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. త్వరితగతిన ఫ్యాక్టరీని పున ప్రారంభించాడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గతంలో ఉన్న బకాయి 170 కోట్లను ప్రభుత్వం అన్నారు. చక్కెర ఫ్యాక్టరీల పరిశీలనకు ఈనెల 26న రాష్ట్ర వ్యవసాయ శాఖ సెక్రెటరీ తోపాటు ఉన్నతాధికారుల బృందం వస్తున్నారని జీవన్ రెడ్డి తెలిపారు. చక్కర ఫ్యాక్టరీలను పున ప్రారంభించడానికి రాష్ట్ర కమిటీ నేతృత్వంలో రైతులతో నేరుగా మాట్లాడడానికి రానున్న రోజుల్లో పంటను ఎలా సాగు చేయాలని అనుకూలమయ్యే పరిస్థితులను అధ్యయనం చేయడానికి ప్రణాళికల బృందం సభ్యులు వస్తున్నారని అన్నారు.దీనికి రైతులతోపాటు అన్ని పార్టీ లు కూడా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మాజీ జెడ్పిటిసి ఆకుల లింగారెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, తుమ్మలపల్లి రాంప్రసాద్, షేక్ మహ్మద్,జాకీర్,ముఖీమ్, కొమ్ముల సంతోష్ రెడ్డి, జీవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల త్రిపుర సుందరిదేవిగా ముమ్మదేవి అమ్మవారు



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల వ్యాప్తంగా సోమవారం నుండి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి, మండలకేంద్రమైనరాయికోడ్ లోని ముమ్మదేవి అమ్మవారికి అర్చకులు సఖరామ్ జోషి,సందీప్ జోషి ఆధ్వర్యంలో వేకువజామున సుప్రభాత సేవతో మేలుకొలుపి అనంతరం భక్తులు డప్పుచప్పులతో వెళ్లి వాగుకు పూజా కార్యక్రమాలు చేసి గంగజలాన్ని తెచ్చి అర్చకుల వేదమంత్రోచ్చరణలతో అభిషేకం అలంకరణ సేవ,తదుపరి నైవేద్యం సమర్పణ,మహా హారతి ఇచ్చారు, అనంతరం మొదటిరోజు బాల త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు, అలాగే ప్రతిరోజు ఆలయ సన్నిధిలో సాయంత్రం 6:30నిమిషాలకు అమ్మవారి స్వరూపం అగు శ్రీచక్రం కు కుంకుమార్చన చేసి హారతి ఇవ్వడం,రాత్రి వివిధ గ్రామాల భజన మండలి సభ్యులచే భజన చేయడం జరుగుతుందని ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు,అలాగే పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు నిత్యపూజలు చేయాడం జరుగుతుంది.

## గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల :** బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అధికారులకు ఆదేశించారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 8 మంది అర్జీదారులతో ఎస్పీ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభించిన మంత్రి అడ్లూరి




**ధర్మపురి :** ధర్మపురి మండలంలోని నాగారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 54 లక్షల వ్యయంతో నిర్మించిన డ్రైనేజ్ మరియు సీసీ రోడ్లను మంత్రి అధికారులతో, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూనాగారం గ్రామంలో నూతనంగా నిర్మించిన డ్రైనేజ్,సీసీ రోడ్లను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పలు ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు 2 లక్షల రూపాపలు అభివృద్ధి యల రుణమాఫీ, అర్హులందరికీ సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ వంటి పథకాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయిని తెలిపారు.అలాగే గ్రామానికి సంబంధించిన కొన్ని సమస్యలు, కులసంఘాల భవనాల నిర్మాణం వంటి అంశాలు తన దృష్టికి వచ్చినందున వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన మరో లారీ

**తప్పిన పెను ప్రమాదం.. ఇద్దరికీ గాయాలు**



**అగ్ని ధార శంకరపట్నం:న్యూస్/సెప్టెంబర్/23** ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి హొటల్లోకి దూసుకెళ్లిన లారీ శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో ఘటన చోటుచేసుకుంది గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, తాడికల్ గ్రామంలోని జాతీయ రహదారిపై పోస్ట్ ఆఫీస్, సమీపంలో జాతీయ రహదారిపై ఓ లారీ ఆగి ఉండగా, సోమవారం తెల్ల వారు జామున మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి పక్కన ఉన్న పోస్ట్ ఆఫీస్ గోడకు అనుకొని ఉన్న హొటల్లోకి దూసుకెల్లగా ఎడ్ల అరుణ, ఉష కోయిల పద్మ అనే మహిళలకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

## పోలీస్ స్టేషన్ ని అకస్మాత్ తనిఖీ




**అగ్నిధారన్యూస్ మహమ్మదాబాద్/ గండిడ్:** ఈరోజు మహబూబ్నగర్ జిల్లా మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్ నీ జోగులాంబ జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహాన్ తనకి చేసినారు తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డ్స్ క్రైమ్ రివ్యూ దొంగతనాలు మరియు రోడ్ యాక్సిడెంట్ సైబర్ క్రైమ్స్ సీసీటీవీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి పోక్సో చట్టం బాల్య వివాహాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఇట్టి తనిఖీ లో మహబూబ్నగర్ జిల్లా అడిషనల్ ఎస్పీ రత్నం మహబూబ్నగర్ జిల్లా డిఎస్పి వెంకటేశ్వర్లు మహబూబ్నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్ పాల్గొన్నారు. డీఐజీ ఎల్ ఎస్ చౌహన్ రాబోవు స్థానిక సంస్థల ఎన్నిక లు సామరస్యంగా శాంతియుతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నిర్వహించాలని సూచించారు డీఐజీ ఎల్ ఎస్ చౌహన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క వివరాలను మరియు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఎస్ పి రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ గాంధీ నాయక్,ఎస్సై శేఖర్ రెడ్డి ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాగులో నీటి ప్రవాహంతో వ్యక్తి మృతి




**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ కుసునూరు గ్రామ నివాసి కృష్ణ 44 సంవత్సరములు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు కూరగాయలు తీసుకువస్తానని తన ఇంటి నుండి బయలుదేరి ప్రతి ఆదివారం రాయికోడ్ చౌరస్తాలో జరిగే సంతకు వెళ్లి కూరగాయలు కొనుక్కొని తిరిగి సాయంత్రం అందాజా ఐదు గంటల 30 నిమిషాల సమయంలో కురుసునూరు గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో గల కుసునూరు బ్రిడ్జి వద్ద రాగానే బ్రిడ్జిపై గల గుంతలను తప్పించే క్రమంలో తను వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి నీటి ప్రవాహంలో పడి నీటి ప్రవాహానికి కొట్టుకొని పోయినాడు. అతని ఆచూకీ గురించి పోలీసు పోలీసు వారు ఎన్డీఆర్ఎఫ్ గ్రామస్తుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టి సోమవారం నాడు ఉదయం 11 గంటల సమయంలో వందూరు మాడ వాగు దగ్గర శవమై తేలిన ముదిరాజ్ కృష్ణ యొక్క శవాన్ని గుర్తించినారు వెంటనే పోస్టార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ తరలించి పోస్టుమార్టం అనంతరం పోలీసు మృతదేహాన్ని రక్త బంధువులకు అప్పగించడం జరిగింది. మృత్తిడి యొక్క భార్య అయిన జానమ్మ ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 88/2025 క్రింద సెక్షన్ 194 బి ఎన్ ఎస్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్వర్ణకవచలాంకృత శ్రీదుర్గాదేవి గా దుర్గమ్మ



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం లోని సింగీతం గ్రామంలో దేవీ నవ రాత్రుల్లో భాగంగా మొదటి రోజు స్వర్ణ కవచాలంకృత శ్రీ దుర్గా దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు అర్చకులు వేదమంత్రోచ్చారణలతో అభిషేకం అలంకరణ సేవ తదుపరి నైవేద్యం సమర్పణ మహా హారతి ఇచ్చారు మొదటిరోజు అమ్మవారు స్వర్ణ కవచలంకృత శ్రీ దుర్గా దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అలాగే ప్రతిరోజు ఆలయ సన్నిధిలో సాయంత్రం6:30 నిమిషాలకు అమ్మవారి స్వరూపమగు శ్రీ చక్రం కుంకుమర్చ చేసి హారతి ఇస్తారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు

# మీరు రోజూ వాడే వంట నూనెలకు బదులుగా ఆవనూనెను ఉపయోగించండి.. ఎన్నో లాభాలను పొందవచ్చు..!



ఆవాలను మనం నిత్యం వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. కూరలకు పోపు పెట్టేందుకు ఆవాలను వాడుతారు. ఇవి వేయడం వల్ల కూరలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఆవాలను ఊరగాయ పచ్చళ్ల తయారీలోనూ ఉపయోగిస్తారు. అయితే ఆవాల నుంచి తీసే నూనెను కూడా కొందరు ఉపయోగిస్తుంటారు. ఆవ నూనెను కేవలం భారతీయులు మాత్రమే కాకుండా ఆసియా, ఐరోపా వంటి కొన్ని దేశాలకు చెందిన ప్రజలు కూడా ఎక్కువగానే ఉపయోగిస్తుంటారు. ఆవ నూనె ఘాటైన వాసనను కలిగి ఉంటుంది. కనుక దీన్ని ఉపయోగించేందుకు చాలా మంది అంతగా ఇష్టపడరు. కానీ ఆవనూనె మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఆవ నూనెలో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమెగా 3, ఒమెగా 6 కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు రాకుండా అడ్డుకుంటాయి. ఆవనూనెలో ఆల్ఫా లినోలినిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని వాపులను తగ్గిస్తుంది.

**చర్మ సమస్యలకు..**

ఆవనూనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇందులో అలైల్ ఐసోథయోసయనేట్ అనే సమ్మేళనం ఉంటుంది. దీని వల్లే ఆవనూనె ఘాటైన వాసనను కలిగి ఉంటుంది. ఈ సమ్మేళనం ఉండడం వల్ల ఆవనూనె యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక ఆవనూనెను రాస్తుంటే చర్మ ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. గజ్జి, తామర వంటి చర్మ సమస్యల నుంచి బయట పడవచ్చు. ఆవనూనెలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఇతర సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కనుక ఇవి శరీరంలోని వాపులను, నొప్పులను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి బయట పడవచ్చు. ఆవనూనెను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థలో రసాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేస్తాయి. దీని వల్ల అజీర్తి తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. దీంతో పోషకాహార లోపం తగ్గుతుంది.

**శిరోజాల సంరక్షణకు..**

ఆవనూనెను మసాజ్ చేసేందుకు కూడా ఉపయోగిస్తారు. అనేక రకాల మసాజ్ థెరపీలలో ఆవనూనెను వాడుతారు. దీన్ని శరీరానికి రాసి మర్దనా చేయడం వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మానికి సహజసిద్ధంగా తేమ లభిస్తుంది. ఆవనూనెను శిరోజాలకు సైతం రాయవచ్చు. ఇది జుట్టును, కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆవనూనెలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లను సంరక్షిస్తాయి. జుట్టు కుదుళ్ల వద్ద ఉండే దురదను తగ్గిస్తాయి. దీంతోపాటు చుండ్రు సమస్య నుంచి బయట పడవచ్చు. ఆవనూనెను తరచూ ఉపయోగిస్తుంటే శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

**ఎలా వాడాలి..?**

ఆవనూనెను వంట చేసేందుకు ఉపయోగించవచ్చు. దీన్ని పలు రకాల కూరల్లో, ఊరగాయల తయారీలో వాడుతారు. వేపుళ్లకు కూడా ఉపయోగిస్తారు. కానీ ఆవనూనెతో వేపుళ్లు చేయకూడదు. ఆవనూనెను ఊరగాయల తయారీకి ఉపయోగించడం వల్ల ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంటాయి. పప్పు లాంటి కూరలను చేసినప్పుడు ఆవనూనెను వేస్తే ఎంతో రుచిగా ఉంటాయి. ఆవనూనెను శరీరానికి బాగా పట్టించి మసాజ్ చేయాలి. గంట సేపు అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా వారంలో కనీసం 1 లేదా 2 సార్లు చేస్తుంటే శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఆవనూనెను నేరుగా తీసుకోలేరు. కానీ కూరల్లో లేదా సలాడ్స్ పై చల్లి తీసుకోవచ్చు. ఒక టేబుల్ స్పూన్ ఆవనూనెను తీసుకుంటే 124 క్యాలరీల శక్తి లభిస్తుంది. 14 గ్రాముల కొవ్వులు, విటమిన్ ఇ వంటి పోషకాలు లభిస్తాయి. ఆవనూనెను ఇలా ఉపయోగిస్తుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# బీట్ రూట్ ఆకులను కూడా తినవచ్చు



బీట్‌రూట్‌ను తినడం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. బీట్ రూట్ మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తుంది. బీట్ రూట్‌ను నేరుగా తినవచ్చు లేదా జ్యూస్ రూపంలో అయినా తీసుకోవచ్చు. బీట్ రూట్‌తో కొందరు వంటలు కూడా చేస్తుంటారు. అయితే కేవలం బీట్ రూట్ మాత్రమే కాదు, దీని ఆకులు కూడా మనకు ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. బీట్ రూట్‌ను కొన్ని సార్లు మనం ఆకులతో సహా చూసి ఉంటాం. కానీ చాలా మందికి తెలియక ఆకులను తీసేస్తుంటారు. అయితే ఈ ఆకుల్లోనూ ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. బీట్ రూట్ ఆకులను కూడా మనం తినవచ్చు. వీటినే బీట్ గ్రీన్స్ అని కూడా పిలుస్తారు. ఇవి అనేక పోషక విలువలను కలిగి ఉంటాయి. బీట్ రూట్ ఆకులను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**పోషకాలు అధికం..**

బీట్ రూట్ ఆకుల్లో విటమిన్ కె అధికంగా ఉంటుంది. ఇది గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం జరగకుండా చూస్తుంది. విటమిన్ కె వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. ఈ ఆకుల్లో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వీటిల్లో ఉండే విటమిన్ సి యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. బీట్ రూట్ లాగే వాటి ఆకుల్లోనూ ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తహీనత తగ్గేలా చేస్తుంది. ఈ ఆకుల్లో ఉండే క్యాల్షియం ఎముకలను ఆరోగ్యంగా మారుస్తుంది. బీట్ రూట్ ఆకుల్లోని మెగ్నిషియం కండరాలకు, నాడులకు బలాన్ని అందిస్తుంది. దీని వల్ల కండరాలు ప్రశాంతంగా మారుతాయి. కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. బీట్ రూట్ ఆకుల్లో ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**కళ్లు, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..**

బీట్ రూట్ ఆకుల్లోనూ యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. బీట్ రూట్ ఆకులను తినడం వల్ల లుటీన్, జియాజాంతిన్ అనే పోషకాలు లభిస్తాయి. ఇవి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కళ్లలో శుక్లాలు ఏర్పడకుండా చూస్తాయి. దీని వల్ల వృద్ధాప్యంలోనూ కళ్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. బీట్ రూట్ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఫైబర్ వల్ల మలబద్దకం తగ్గుతుంది. పొట్ట నిండుగా ఉన్న భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**.జాగ్రత్తలు తప్పనిసరి..**

బీట్ రూట్ ఆకులను నేరుగా తినవచ్చు లేదా వండుకుని కూడా తినవచ్చు. ఇవి కాస్త మట్టి రుచి, వాసనను కలిగి ఉంటాయి. కానీ ఈ ఆకులు అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తాయి. బీట్ రూట్ ఆకులను వండేముందు లేదా నేరుగా తినేముందు శుభ్రంగా కడగాల్సి ఉంటుంది. బీట్ రూట్ ఆకుల రుచి కాస్త పాలకూరను పోలి ఉంటుందని చెప్పవచ్చు. బీట్ రూట్ ఆకులను ఇతర కూరగాయలతో కలిపి కూడా వండుకోవచ్చు. సలాడ్స్‌లోనూ వేసి తినవచ్చు. సూప్‌లు, స్మూతీల వంటి వాటిలోనూ వేసి తీసుకోవచ్చు. బీట్ రూట్ ఆకులను 100 గ్రాములు తింటే కేవలం 22 క్యాలరీలే లభిస్తాయి. పిండి పదార్థాలు 4.3 గ్రాములు, ఫైబర్ 3.7 గ్రాములు, ప్రోటీన్లు 2.2 గ్రాములు ఉంటాయి. అలాగే విటమిన్లు కె, ఎ, సిలతోపాటు క్యాల్షియం, ఐరన్, మెగ్నిషియం, పొటాషియం కూడా అధిక మొత్తాల్లో ఉంటాయి. ఇక బీట్ రూట్ ఆకుల్లో ఆగ్జలేట్స్ అధికంగా ఉంటాయి కనుక కిడ్నీ స్టోన్లు, గాల్ బ్లాడర్ స్టోన్లు ఉన్నవారు ఈ ఆకులను తినకూడదు. ఇలా పలు జాగ్రత్తలను పాటిస్తూ బీట్ రూట్ ఆకులను తింటుటే అనేక లాభాలను పొందవచ్చు.



## కిస్మిస్ లను వేసి మరిగించిన పాలను రోజూ తాగండి..

# ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి..!

మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో పాలు ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తాయి. పాలలో మన శరీరానికి కావల్సిన దాదాపు అన్ని పోషకాలు ఉంటాయి. కనుకనే పాలను సంపూర్ణ పౌష్టికాహారంగా పిలుస్తారు. పాలను తాగడం ఎంతో పురాతన కాలం నుంచి వస్తున్న ఆహారపు అలవాటు. పాలలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కనుకనే చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ పాలను తాగాలని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతుంటారు. అయితే పాలలో చక్కెర కలపకుండా కొన్ని కిస్మిస్‌లను వేసి బాగా మరిగించి అనంతరం ఆ పాలను తాగాల్సి ఉంటుంది. ఇలా పాలలో కిస్మిస్‌లను వేసి మరిగించి తాగడం వల్ల ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కిస్మిస్ పాలను తాగితే అనేక వ్యాధులు నయం అవుతాయని వారు అంటున్నారు.

**రక్తహీనతకు చెక్..**

కిస్మిస్‌లలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలో ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల కిస్మిస్‌లను పాలలో వేసి మరిగించి తాగితే ఐరన్ ను పొందవచ్చు. ఇది హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీని వల్ల ఐరన్ లోపం తగ్గుతుంది. రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. కిస్మిస్‌లను పాలలో వేసి మరిగించి రాత్రి పూట తాగితే మైండ్ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. శరీరంలో ట్రిప్టోఫాన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది నిద్రను ప్రేరేపించే హార్మోన్. కనుక రాత్రి పూట కిస్మిస్ పాలను తాగితే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అయి నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. నాడీ మండల వ్యవస్థ ప్రశాంతంగా మారుతుంది. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచే సరికి చురుగ్గా ఉత్సాహంగా ఉంటారు. రోజంతా శక్తిస్థాయిలు అధికంగా ఉంటాయి. యాక్టివ్‌గా పనిచేస్తారు.

**మలబద్దకం ఉండదు..**

పాలలో కిస్మిస్‌లను వేసి మరిగించి తాగితే ఫైబర్ అధికంగా లభిస్తుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. పాలలో క్యాల్షియం అధికంగా ఉంటుందన్న విషయం తెలిసిందే. అందువల్ల పాలను ఇలా తాగితే ఎముకలు, దంతాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిస్మిస్‌లలోనూ అధిక మొత్తంలో క్యాల్షియం ఉంటుంది. దీంతోపాటు బోరాన్ కూడా లభిస్తుంది. అందువల్ల కిస్మిస్‌లను పాలలో వేసి మరిగించి తాగితే పెద్ద మొత్తంలో క్యాల్షియంను పొందవచ్చు. దీంతోపాటు బోరాన్ కూడా లభిస్తుంది కనుక ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ముఖ్యంగా వయస్సు మీద పడడం వల్ల వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

**ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి..**

కిస్మిస్ పాలను తాగడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా లభిస్తాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, పాలిఫినాల్స్ అధికంగా లభిస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గేలా చేస్తాయి. దీంతోపాటు విటమిన్లు, మినరల్స్‌ను కూడా మనం పొందవచ్చు. ఇవన్నీ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో ఇన్ ఫెక్షన్లు తగ్గిపోతాయి. కిస్మిస్‌లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది బీపీని నియంత్రిస్తుంది. కిస్మిస్‌లలో ఉండే ఫైబర్ మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. ఇలా కిస్మిస్‌లను వేసి మరిగించిన పాలను తాగుతుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## బిజినెస్

### స్నో కింగ్డమ్‌లో దసరా దాండియా సంబురాలు




హైదరాబాద్ : దాండియా ఆటలు, బతుకమ్మ సంబురాలు ఒకే సారి చేయ్యలనుకుంటున్నారా అది కూడా మంచు సోయాగాల్లో ఆడి పాడి సరదాగా గడపాలనుకుంటున్నారా.. అయితే ఈ దసరాకి హైదరాబాద్ రావల్సిందే. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటే విదంగా స్నో కింగ్డమ్ సిద్ధమైంది. కొండాపూర్ శరత్ సిటీ మాల్ స్నో కింగ్డమ్ మంచు సోయాగాల్లో పిల్లలకు సరికొత్త థ్రిల్ అందించేలా ఏర్పాటు చేసింది. స్నో దాండియా పేరుతో హైదరాబాద్ వాసులకు 11 రోజులు పాటు మంచులో ఆటా- పాటలతో స్నో కింగ్డమ్ అలరిస్తుంది. దుర్గాదేవిని పూజిస్తూ దాండియా నృత్యాలు చేయడం గుజరాతీ, రాజస్థానీల ఆచారం. దసరా నవరాత్రుల సమయంలో ఎక్కువగా దాండియా ఆటలే కనిపిస్తాయి. అలాంటి దాండియా మంచులో చేస్తే ఎలా ఉంటుంది? అలాంటి ఉత్సాహాన్ని హైదరాబాద్ వాసులకు అందించేందకు స్నో కింగ్డమ్ సిద్ధమైంది. ఈ నవరాత్రులల్లో తొమ్మిది రోజులు.. దాండియా ఆట పాటలతో పాటు బతుకమ్మ సంబరాలతో సరికొత్త సోయగాలతో స్నో కింగ్డమ్ అలరించనుంది. దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్న దసరా ఉత్సవాలుకు దేశ వ్యాప్తంగా సంస్కతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తు ఈ వేడుకలు నిర్వహిస్తుంది. కొండాపూర్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్లో ఈ బతుకమ్మ దాండియా వేడుకలను స్నో కింగ్డమ్ ఏర్పాటు చేసింది. ఇందులో మంచు ప్యాలెస్‌లు, మంచుతో కప్పిన పర్వతాలు, బ్లాక్ సీల్స్, ఓక్ చెట్లు, ఇగ్లూలు, ధ్రువపు ఎలుగుబంట్లు చూపరులను కట్టిపడేస్తున్నాయి. 32 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్నోకింగ్డమ్ ఏర్పాటు చేశారు. పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.650 రూపాయలుగా టికెట్ ధర నిర్ణయించారు. మంచులో ఆడుకోవడం, టోబో గానింగ్, స్నో స్లైడింగ్, స్నో రాక్ క్లైంబింగ్, స్నో డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఉన్నాయి. దసరా పండుగ పురస్కరించుకొని ఇప్పుడు దాండియాను సైతం జోడించారు. అలాగే మంచులో ఆడుకోవడానికి అవసరవయ్యే సూట్ కూడా వాళ్లే ఇస్తున్నారు. మొత్తంగా మంచులో ఎంజాయ్ చేయడానికి దాండియా ఆడటానికి ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేకుండా..మన హైదరాబాద్ లోనే ఏర్పాటైన ఈ స్నోకిండ్ డమ్ మీకు మంచి వినోదాన్ని పంచుతుంది. దాండియా కేవలం అందరూ కలిసి ఆనందించడానికి ఆడుకొనే ఆటలు మాత్రమే కావని..ఇది ఆరోగ్యపరంగా, ఫిట్ నెస్ పరంగా ఎన్నో ప్రయోజానాలు ఉన్నాయని స్నోకింగ్ డమ్ మేనేజింగ్ డైరెక్టర్ పువ్వాడి హరిక తెలిపారు. దాండియా డ్యాన్ ఒత్తిడిని తగ్గిస్తుందని..ఈ దసరా నవరాత్రుల్లో 11 రోజులు..దాండియా ఆడి అలసిపోయి ప్రశాంతంగా నిద్రపోతారన్నారు. డాండియా ఒత్తిడి, ఆందోళన కూడా దూరం చేస్తుందంటున్నారు. అలాగే ఎంతో సరదాగా సాగే ఈ ఆట బత్తిడిని దూరం చేయడంతొ పాటు మానసికొల్లాసాన్ని కూడా అందిస్తుందని హరిక అన్నారు.

# పతనమైన స్టాక్ మార్కెట్లు..!
# కుప్పకూలిన ఐటీ స్టాక్స్!



భారతీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. ట్రంప్ కొత్త వీసా విధానం నేపథ్యంలో మార్కెట్లు పతనమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1బీ వీసా వన్ టైమ్ ఫీజును సుమారు రూ.88లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దాంతో ఐటీ దిగ్గజాల స్టాక్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 82,151.07 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఏ దశలోనూ మళ్లీ మార్కెట్లు కోలుకోలేదు. ముఖ్యంగా ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (%ఙజూ%), ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, కోఫోర్జ్ వంటి ప్రధాన కంపెనీల షేర్లు భారీగా పడిపోయాయి. ఇంట్రాడేలో 82,583.16 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,997.29 పాయింట్ల వరకు పతనమైంది. చివరకు 466.26 పాయింట్లు పతనమై.. 82,159.97 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 124.70 పాయింట్లు తగ్గి 25,202.35 వద్ద ముగిసింది. దాదాపు 1,715 షేర్లు లాభపడగా.. 2,467 షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం పడిపోయాయి. ఐటీ ఇండెక్స్ 2.7 శాతం, ఫార్మా 1.2 శాతం పతనం కాగా.. పవర్ ఇండెక్స్ 1.6 శాతం, చమురు, గ్యాస్ ఇండెక్స్ 0.4 శాతం, మెటల్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన షేర్లలో టెక్ మహీంద్రా, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, సిప్లా ఉన్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఆటో, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి. ట్రంప్ పాలసీ విధానంతో అనిశ్చితి నెలకొన్నది. హెచ్1బీ వీసా విధానం కీలకం. భారతీయ ఐటీ కంపెనీలకు యూఎస్ చాలా కీలకం. ఈ కంపెనీలు తమ ఆదాయంలో ఎక్కువ భాగం యూఎస్ మార్కెట్ నుంచే వస్తుంది. కంపెనీలు తమ ఉద్యోగులను యూఎస్ మార్కెట్‌లో ఆన్ సైట్‌లో చేసేందుకు పంపుతుంటాయి. దీనికి హెచ్1బీ వీసాలు అవసరం. ట్రంప్ ఈ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కంపెనీలే ఈ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కొత్త హెచ్1బీ దరఖాస్తుదారులకు మాత్రమే కొత్త ఫీజు వర్తిస్తుందని.. ఇప్పటికే ఉన్న వీసాదారులకు కాదని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. యూఎస్‌లోకి తిరిగి ప్రవేశించేందుకు అదనపు ఫీజులు ఉండవని.. ఇది ఐటీ కంపెనీలకు నష్టాలను పరిమితం చేస్తుంది. కానీ కంపెనీలు ఈ భారాన్ని క్లయింట్లకు బదిలీ చేయగలవా? అనేది అనిశ్చితి ఉన్నది. అయితే, శుక్రవారం భారత మార్కెట్లు ముగిసిన వెంటనే ట్రంప్ కొత్త వీసా విధానాన్ని ప్రకటించారు. ఆ తర్వాత సోమవారం మార్కెట్లు ప్రారంభం కాగానే ఐటీ స్టాక్ భారీగా పతనమయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఊహించినట్లుగానే ఐటీ స్టాక్స్ భారీగా పడిపోయాయి.

# రూ.200 లోపు రీచార్జ్.. రోజుకు 2 జీబీ డేటా



ప్రభుత్వ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కస్టమర్లను ఆకర్షించేందుకు కొత్త కొత్త, చౌకౌన ప్రీపెయిడ్ ప్లాన్లను ప్రవేశపెడుతూనే ఉంది. ఇటీవల అపరిమిత కాలింగ్, రోజువారీ డేటా, ఇతర ప్రయోజనాలతో రూ .199 రీఛార్జ్ ప్లాన్‌ను ప్రకటించింది.

**రూ .199 రీఛార్జ్ ప్లాన్ ప్రయోజనాలు**

రూ.199 ప్రీపెయిడ్ ప్లాన్‌లో అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ హై స్పీడ్ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. అదనంగా టెలికాం ఆపరేటర్ రీఛార్జ్ పై 2% తగ్గింపును కూడా అందిస్తోంది. ఆసక్తి ఉన్న వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వెబ్‌సైట్, సెల్ఫ్ కేర్ యాప్ ద్వారా మాత్రమే రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇవి కాకుండా, బీఎస్ఎన్ఎల్ బడ్జెట్ ఫ్రెండ్లీ వినియోగదారుల కోసం కేవలం రూ .107 నుండి ప్రారంభమయ్యే ప్రీపెయిడ్ ప్లాన్లను కూడా అందిస్తుంది. ఈ ప్లాన్ 35 రోజుల వాలిడిటీతో వస్తుంది. ఇందులో 3 జీబీ హైస్పీడ్ డేటా, 200 ఫ్రీ వాయిస్ మినిట్స్ (లోకల్, ఎస్టీడీ, రోమింగ్) లభిస్తాయి. అదనంగా, రూ .141 ప్యాక్ కూడా ఉంది. ఇది 30 రోజుల పాటు రోజుకు 1.5 జీబీ, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 200 ఎస్ఎంఎస్ లను అందిస్తుంది.

# పాక్‌ను చిత్తు చేసిన భారత్..
## గౌతం గంభీర్ పోస్ట్ వైరల్

దాయాది పాకిస్తాన్‌కు టీమిండియా మరోసారి తమ స్థాయి ఏమిటో చూపించింది. దూకుడైన ఆటతో 'చిరకాల ప్రత్యర్థి'కి చెక్‌పెట్టి .. పొట్టి ఫార్మాట్లో మరోసారి ఆధిపత్యాన్ని చాటుకుంది. కాగా ఆసియా కప్-2025 టోర్నీలో భాగంగా లీగ్ దశలో ఏడు వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించిన భారత్.. తాజాగా కీలకమైన సూపర్-4 దశలోనూ సత్తా చాటింది. దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన.. సల్మాన్ ఆఘా బృందాన్ని ఆరు వికెట్ల తేడాతో ఓడించింది. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ చేసిన భారత్.. పాక్‌ను నిర్ణీత 20 ఓవర్లలో 171 పరుగులకు కట్టడిచేయగలిగింది.

**అభిషేక్- గిల్ ధనాధన్**

ఇక లక్ష్య ఛేదనలో టీమిండియా మరోసారి తన మార్కును చూపించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ శుబ్‌మన్ గిల్ అద్భుత రీతిలో ఆకట్టుకున్నాడు. అభిషేక్ 39 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సలు బాది 74 పరుగులు చేయగా.. గిల్ 28 బంతుల్లో 47 పరుగులు సాధించాడు. వీరికి తోడుగా తిలక్ వర్మ (19 బంతుల్లో 30) ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించాడు. ఈ క్రమంలో 18.5 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే నష్టపోయి టీమిండియా లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో టీ20 ఫార్మాట్లో పదిహేనుసార్ల ముఖాముఖి పోరులో టీమిండియా పాక్‌పై పన్నెండోసారి గెలుపు జెండా ఎగురవేసింది.




**దిగ్గజాలు లేకుండానే**

ఈసారి ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి దిగ్గజాలు లేకుండానే యువ భారత జట్టు పాక్‌ను ఓడించడం విశేషం. ఈ నేపథ్యంలో టీమిండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్ జట్టు ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశాడు.

**ఫియర్‌లెస్..**

ఇన్‌స్టా స్టోరీలో "ఫియర్‌లెస్.. ఫియర్‌లెస్.. ఫియర్‌లెస్" అంటూ అభిషేక్ శర్మ, శుబ్‌మన్ గిల్‌లతో పాటు టీమిండియా ఫొటోను గంభీర్ షేర్ చేశాడు. తమకు భయం లేదు.. తిరుగు లేదు అన్నట్లుగా గంభీర్ ప్రత్యర్థి జట్లకు పరోక్షంగా హెచ్చరిక జారీ చేశాడు. ముఖ్యంగా మైదానంలో అతి చేసిన దాయాది పాక్‌కు తనదైన శైలిలో ఇలా కౌంటర్ వేశాడు.

### రెచ్చగొట్టే సంకేతాలు చేసిన హారీస్ రౌఫ్..
### పాక్ బౌలర్ ప్రవర్తనపై విమర్శలు




**దుబాయ్ :** ఆసియాకప్‌లో దాయాది పాకిస్థాన్ జట్టుపై ఇండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సూపర్ ఫోర్ మ్యాచ్‌లో ఆదివారం ఇండియా చాలా ఈజీగా విక్టరీ కొట్టేసింది. కానీ ఆ గేమ్‌లో పాకిస్థాన్ బౌలర్ హారీస్ రౌఫ్ అనుచితంగా వ్యవహరించాడు. తన ప్రవర్తనతో అతను విమర్శల పాలవుతున్నాడు. బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో.. గ్యాలరీలోని ప్రేక్షకులు కోహ్లీ.. కోహ్లీ అంటూ అరిచారు. ఆస్ట్రేలియాలో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో జరిగిన సంఘటనను గుర్తు చేసే రీతిలో స్టాండ్స్‌లో ఉన్న ప్రేక్షకులు కేకలు పెట్టారు. అయితే ఆ సయమంలో హారీస్ రౌఫ్ అర్థం కాని రీతిలో కొన్ని సంకేతాలు ఇచ్చాడు. విమానం కూలుతున్నట్లుగా అతను తన చేతులతో సిగ్నల్స్ ఇచ్చాడు. చేతి వేళ్లతో 6-0 అని చూపించాడు. ఆ తర్వాత విమానం కూలుతున్నట్లు సంకేతం ఇచ్చాడు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత యుద్ధ విమానాలను కూల్చామన్న సంకేతాన్ని రౌఫ్ ఇచ్చినట్లు కొందరు విమర్శకులు అంటున్నారు. దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీలో శిక్షణ చేస్తున్న సమయంలో కూడా పాక్ ఆటగాళ్లు 6-0 సంకేతం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రాక్టీస్‌లో భాగంగా పాక్ క్రికెటర్లు ఫుట్‌బాల్ ఆడుతున్న సమయంలో ఓ బృందం 6-0తో ముందంజలో ఉన్నది. ఆ సమయంలో పాక్ ఆటగాళ్లు 6-0, 6-0 అంటూ అరవడం మొదలుపెట్టారు. భారతీయ జర్నలిస్టుల సమక్షంలో పాక్ క్రికెటర్లు కేకలు పెట్టినట్లు తెలుస్తోంది. ఏదో ఉద్దేశంతోనే పాక్ ఆటగాళ్లు అలా అరిచినట్లు కొందరు పసికట్టారు.

## స్పోర్ట్స్

### రైఫిల్ ఫైరింగ్ సెలబ్రేషన్..
### ఐ డోంట్ కేర్ అంటున్న పాక్ బ్యాటర్



దుబాయ్: పాకిస్థాన్ బ్యాటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. ఆ బ్యాటర్ తన పవర్‌ఫుల్ స్ట్రోక్స్‌తో కాసేపు అలరించాడు. 45 బంతుల్లోనే అతను 58 రన్స్ చేశాడు. ఆల్‌రౌండర్ శివం దూబే బౌలింగ్‌లో అతను ఔటయ్యాడు. అయితే పాక్ జట్టుకు మంచి ఫౌండేషన్ ఇచ్చిన ఫర్హాన్.. హాఫ్ సెంచరీ స్కోరు చేయగానే సంబరాలు జరుపుకున్నాడు. బ్యాట్‌ను రైఫిల్‌లా ఎక్కిపెట్టి.. ఫైరింగ్ చేస్తూ తన హాఫ్ సెంచరీ ఫీట్‌ను సెలబ్రేట్ చేసుకున్నాడు. ఏకే47 గన్‌తో ఫైరింగ్ చేస్తున్నట్లు ఎంజాయ్ చేశాడు. దీనిపై విమర్శలు వస్తున్నాయి. క్రికెట్‌లో ఫైరింగ్ సెలబ్రేషన్ ఏందని కొందరు నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. రైఫిల్ ఫైరింగ్ సెలబ్రేషన్‌పై కామెంట్ చేశాడు ఫర్హాన్. శ్రీలంకతో రేపు సూపర్ 4 మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఇవాళ జరిగిన మీడియా సమావేశంలో ఫర్హాన్ పాల్గొన్నాడు. గన్ ఫైరింగ్ సెలబ్రేషన్ గురించి ఎవరు ఏమి అనుకున్నా పట్టించుకోనన్నాడు. తనకు నచ్చినట్లు సెలబ్రేట్ చేసుకున్నట్లు చెప్పాడు. ఎవరేమనుకున్నా ఐ డోంట్ కేర్ అన్నాడు. ఒకవేళ మీరు సిక్సర్ల గురించి మాట్లాడితే, భవిష్యత్తులో అలాంటివి ఇంకా చూస్తారన్నాడు. సెలబ్రేషన్ మాత్రం ఆ టైంలో అలా జరిగిపోయిందన్నాడు. 50 స్కోర్ చేస్తే సెలబ్రేట్ చేసుకోను అని, కానీ ఆ క్షణంలో తన మెదడులో ఆలోచన వచ్చిందని, అందుకే ఆ ఫైరింగ్ సెలబ్రేషన్ చేసుకున్నట్లు చెప్పాడు. తన సంబరాల గురించి ప్రజలు ఎలా మాట్లాడుకుంటారో చెప్పలేనని, కానీ మిగితా సందర్భాల్లో చాలా దూకుడుగా క్రికెట్ ఆడాలన్నాడు. ఇండియాతో ఆడినప్పుడే కాదు, ప్రతి సందర్భంలోనూ దూకుడుగానే ఆడాలన్నాడు. ఇటీవల తమ జట్టు పవర్‌ప్లేలో ఎక్కువగా వికెట్లను కోల్పోయిందని, ఆ సమస్యను పరిష్కరించుకోవాలన్నాడు. మొదటి ఆరు ఓవర్లలోనే వీలైనన్ని పరుగులు చేయాలన్నాడు. పవర్‌ప్లే ఓవర్లను ఉపయోగించుకోవడం లేదని, వికెట్లను చేజార్చుకుంటున్నామన్నాడు.



## ‘నటుడిగా ప్రాణం పోసిన సినిమా’: మెగాస్టార్ చిరంజీవి ట్వీట్


సినీ రంగంలో స్టార్ అనే హోదా చాలామందికి వస్తుంది. కానీ ఆ గుర్తింపును కెరీర్ మొత్తం కొనసాగించాలంటే అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఇక ఇండస్ట్రీలో మెగాస్టార్ అనిపించుకునే అదృష్టం కొందరికే ఉంటుంది. మన తెలుగు సినీరంగంలో అలాంటి ఘనత సొంతం చేసుకున్న హీరో ఆయనొక్కరే. మన టాలీవుడ్‌లో ఇప్పటికీ.. ఎప్పటికీ ఆయనే మెగాస్టార్. ఆయనే మన కొణిదెల శివ శంకర వరప్రసాద్ అలియాస్ చిరంజీవి. చిరంజీవి తన కెరీర్ మొదలుపెట్టి 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎమోషనల్ పోస్ట్ చేశారు. 22 సెప్టెంబర్ 1978న ప్రాణం ఖరీదు ?అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యానని ట్వీట్ చేశారు. ఈ చిత్రం ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి మీ ముందు మెగాస్టార్‌గా నిలబెట్టిందన్నారు. అనుక్షణం నన్ను ఆదరించి, అభిమానించిన తెలుగు సినిమా ప్రేక్షకులకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని పోస్ట్ చేశారు. చిరంజీవి తన ట్వీట్‌లో రాస్తూ..’22 సెప్టెంబర్ 1978 ‘కొణిదెల శివ శంకర వరప్రసాద్’ అనబడే నేను.. ప్రాణం ఖరీదు.. చిత్రం ద్వారా ‘చిరంజీవిగా’ మీకు పరిచయం అయ్యి నేటితో 47 ఏళ్లు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ చిత్రం ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి.. మీ అన్నయ్యగా, కొడుకుగా, మీ కుటుంబ సభ్యుడిగా , ఒక మెగాస్టార్‌గా.. అనుక్షణం నన్ను ఆదరించి, అభిమానించిన తెలుగు సినిమా ప్రేక్షకులకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను. నేటికి 155 సినిమాలను నేను పూర్తి చేసుకున్నాను అంటే... అందుకు కారణం నిస్వార్థమైన మీ ప్రేమే కారణం. ఈ 47 ఏళ్లలో నేను పొందిన ఎన్నో అవార్డులు, గౌరవమర్యాదలు నావీ కావు, మీ అందరివీ, మీరందించినవి. మనందరి మధ్య ఈ ప్రేమానుబంధం ఎల్లప్పటికీ ఇలాగే కొనసాగాలి అని కోరుకుంటూ... కృతజ్ఞతలతో మీ చిరంజీవి’ అంటూ పోస్ట్ చేశారు. ఈ ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది.

## ప్రేమలో ఉన్నందుకు తగిన శాస్తి.. హీరోయిన్ ఆవేదన




రామ్ గోపాల్ వర్మ తీసిన ‘వంగవీటి’ సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన నైనా గంగూలీ.. తర్వాత కూడా ఆర్జీవీ తీసిన ‘డేంజరస్’ అనే మూవీలో నటించింది. వీటితో పాటు జోహార్, మళ్లీ మొదలైంది, తగ్గేదే లే తదితర చిత్రాలతోనూ అలరించింది. గతేడాది ఈమె కన్నడలోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. అయితే తన బాయ్ ఫ్రెండ్ తనని వేధిస్తున్నాడని చెప్పి ఇన్ స్టాలో ఈమె పోస్ట్ పెట్టింది. అయితే ఎవరు ఏంటి అనేది మాత్రం బయటపెట్టలేదు. ‘నా వ్యక్తిగత విషయాలు కొన్ని మీకు చెప్పే టైమ్ వచ్చింది. గత మూడేళ్లుగా నేను ఎక్కడా పనిచేయలేదు. దానికి ఓ కారణముంది. కానీ ఇప్పుడు అదెందుకో చెప్పేందుకు మీ ముందుకొచ్చాను. కోల్‌కతాకి చెందిన కొరియోగ్రాఫర్‌తో గత కొన్నేళ్ల నుంచి నేను రిలేషన్‌లో ఉన్నాను. కానీ ప్రేమలో ఉన్నందుకు నాకు తగిన శాస్తి జరిగింది. ప్రతిరోజూ శారీరకంగా, మానసికంగా టార్చర్ అనుభవిస్తున్నాను. ఆర్థిక ఇబ్బందులు కూడా చుట్టుముట్టాయి. అతడి ప్రియుడు త్వరలోనే బయటపెడతాను’ అని నైనా గంగూలీ ఇన్ స్టాలో పోస్ట్ పెట్టింది. కోల్‌కతాలో పుట్టిన నైనా.. మోడలింగ్ చేసింది. అలా రాంగోపాల్ వర్మ దృష్టిలో పడింది. హీరోయిన్‌గా పలు సినిమాలు చేసింది. మరి రిలేషన్?లో ఉండటం వల్ల మూవీస్ చేయకపోవడం, ప్రియుడు వేధింపులు చూస్తుంటే విషయం ఏదో పెద్దగానే ఉన్నట్లు కనిపిస్తుంది. మరి ఆ కొరియోగ్రాఫర్ ఎవరో ఏంటో నైనా చెప్తే అసలు విషయం ఏంటనేది క్లారిటీ రావొచ్చు.

## ‘బ్రహ్మానందం’ పాపులర్ డైలాగ్‌తో సాంగ్




ప్రియదర్శి నిహారిక ఎన్ఎమ్ కలిసి నటిస్తోన్న కొత్త చిత్రం ‘మిత్ర మండలి’. కామెడీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు విజయేందర్ తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాంగ్‌ను విడుదల చేశారు. ‘జంబర్ గింబర్ లాలా’ లిరిక్స్‌తో ఉన్న ఈ సాంగ్ అందరినీ మెప్పించేలా ఉంది. శ్రీనువైట్ల తెరకెక్కించిన ‘వెంకీ’ సినిమాలో గజాలా పాత్రలో బ్రహ్మానందం తన కామెడీతో అదరగొట్టారు. ఆ మూవీలో ‘జంబర్ గింబర్ లాలా’ అంటూ బ్రహ్మీ పాడే సాంగ్ ఇప్పటికీ సోషల్‌మీడియాలో తెగ వైరలవుతోంది. తాజాగా ఇదే లైన్‌తో ఏకంగా సాంగ్ లో వాడారు. హీరో ప్రియదర్శి, ‘మ్యాడ్’ ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం మిత్ర మండలి. ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సిద్ధార్థ్ ఎస్.జె, ఎడిటర్‌గా పీకే వ్యవహరిస్తున్నారు. ‘మిత్ర మండలి’ అనేది స్నేహం ప్రధానంగా నడిచే కథ. ఇది ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుంది. అక్టోబర్ 16న ఈ చిత్రం విడుదల కానుంది.




## పవన్ కల్యాణ్ “ఓజీ” తుపాను మొదలైంది..

### ఫైనల్ ట్రైలర్‌తో మాస్ హంగామా !

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిన్న (సెప్టెంబర్ 21) జరిగిన ఓజీ ప్రీ-రిలీజ్ ఈవెంట్ అభిమానులకు మరచిపోలేని తీపి జ్ఞాపకాన్ని అందించింది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్ రిలీజ్ చేయాలని మేకర్స్ భావించిన పూర్తి వర్క్ కాకపోవడం వలన పోస్ట్ చేయాలని అనుకున్నారు. కాని పవన్ కళ్యాణ్ సూచన మేరకు అప్పటి వరకూ రెడీ అయిన ట్రైలర్‌ను అక్కడే విడుదల చేయడం జరిగింది. ఇక కొద్ది సేపటి క్రితం ఫైనల్ వెర్షన్ “ఓజీ” థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది. ఇది విడుదలవ్వగానే సోషల్ మీడియాను, సినిమా వర్గాలను పూర్తిగా షేక్ చేస్తోంది. దర్శకుడు సుజీత్ ఫుల్ మేకోవర్, తమన్ అదిరే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పవన్ కళ్యాణ్ పవర్‌ఫుల్ డైలాగ్స్, విలన్ లుక్స్ ఈ ట్రైలర్‌ను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లాయి. ట్రైలర్‌లో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ అవతారం, స్టైల్ , తమన్ మ్యూజిక్ , రిచ్ విజువల్స్ , క్లాస్ టు మాస్ పాకేజింగ్, చివర్లో పవన్ చెప్పిన “నా కొడకల్లారా..!” పంచ్ డైలాగ్ పూనకాలు తెప్పిస్తున్నాయి. ఈ డైలాగ్ విన్నవెంటనే అభిమానుల్లో గూస్‌బంప్స్ పుట్టించడంతో పాటు, ట్రైలర్‌కు ఊహించని రేంజ్‌లో బజ్ తీసుకొచ్చింది. గతంలో “లాస్ట్ పంచ్ మనదైతే వచ్చే కిక్కే వేరప్ప” లాంటి డైలాగ్ ఎంత హైప్ తీసుకువచ్చిందో, ఇదీ అదే స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.ఏపీ డిప్యూటీ సీఎం పదవి చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ నుంచి ఈ స్థాయి మాస్ యాంగిల్ రావడం అభిమానుల్లో సంబరాలు తెచ్చిపెట్టింది. రాజకీయంగా బిజీగా ఉన్నప్పటికీ, పవన్ తన అభిమానుల కోసం, “ఓజీ” చిత్రాన్ని పట్టుదలగా తీసుకొని పూర్తి చేశాడు. సినిమా పై ఆయన ఉన్న డెడికేషన్ ట్రైలర్‌తో తెలిసిపోతుంది.

ప్రస్తుతం “ఓజీ” ట్రైలర్ ట్రెండింగ్‌లో టాప్‌లో ఉంది. ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ప్రతి ప్లాట్‌ఫామ్‌లోనూ “ఓజీ” ట్రైలర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. చాలామంది ఫ్యాన్స్, సినీ విశ్లేషకులు ఒకే మాట అంటున్నారు ..“ఇది తొలిరోజే ?100 కోట్లు రాబట్టే సినిమా!” అని కామెంట్ చేస్తున్నారు. సెప్టెంబర్ 25న, విజయదశమి కానుకగా “ఓజీ” గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. విడుదలకు ముందే ఈ స్థాయిలో హైప్ ఉండడం సినీ ఇండస్ట్రీకి ఒక పెద్ద విషయమే. “గెట్ రెడీ%౫% పవన్ కళ్యాణ్ ‘ఓజీ’తో తెరపై మాస్ తుఫాన్‌ను ఎవరూ ఆపలేరు అంటూ అభిమానులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com